ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 10 అక్టోబరు 2025



దివ్యాంగులకు నేటినుంచి సదరం క్యాంపులు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా కింద మెడికల్, బెడ్ రిడన్, ఇతర ఆరోగ్య సమస్యల కేటగిరీలోని పెన్షనర్లకు మరోసారి సదరం క్యాంపులు నిర్వహించి, ప్రత్యేకంగా పరీక్షలు చేయనున్నారు. మెడికల్ గ్రౌండ్స్ కింద పించన్ పొందుతున్న వారిలో అనర్హులను గుర్తించిన ప్రభుత్వం ఇటీవల వారి పెన్షన్‌ను తాత్కాలిక నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా వ్యాప్తంగా 2200 మంది డిజేబుల్డ్ పెన్షన్‌కు తాము అర్హులమేనంటూ ఎంపీడీవోలకు, మున్సిపల్, కార్పొరేషన్ కమిషనర్లకు దరఖాస్తు చేసుకున్నారు. వీరికంతా అధికారులు నోటీసులు జారీ చేశారు. కాగా మెడికల్ గ్రౌండ్స్ కింద బెడ్ రిడన్, వీల్‌చైర్‌కు పరిమితమైనవారు, కండరాల సమస్యలు, కిడ్నీ, లివర్, హార్ట్ వంటి ఇతర సమస్యలతో బాధపడుతున్నవారు లేకపోలేదు.వీరికి శుక్రవారంనుంచి మరోసారి సదరం క్యాంపులు నిర్వహించి.. ప్రత్యేక వైద్య పరీక్షలు చేయనున్నారు.

13న చిత్తూరు ఐటీఐలో అప్రెంటీస్‌షిప్ మేళా

చిత్తూరు అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 13వ తేదీన ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్‌షిప్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ మేళాకు ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో శిక్షణ పూర్తిచేసి.. పాసైన వారు తమ ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. ముందు అభ్యర్థులు అప్రెంటీస్‌షిప్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, లేదంటే ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావాలని సూచించారు.ఈమేళాకు జిల్లాలోని ప్రభుత్వ,ప్రైవేటుకంపెనీలు పాల్గొంటున్నాయని చెప్పారు.



గేట్ల లీకేజీ



జలాశయం

పట్టించుకోండి సార్

కృష్ణాపురం జలాశయం గేట్ల లీకేజి
అధ్వానపు రహదారితో ఇబ్బందులు

కార్వేటినగరం మండలం కృష్ణాపురం జలాశయం బాగోగుల గురించి పట్టించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ జలాశయానికి మూడు గేట్లున్నాయి. ఇందులో ఒక గేటు మొరాయిస్తోందని సమాచారం. మరో రెండు గేట్లు కూడా లీకేజీతో ఉన్నాయి. జలాశయానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా గోతులతో నిండిపోయింది. అక్కడ అధికారులు ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయ ఆవరణం మొత్తం పిచ్చిమొక్కలతో ఉంది. ఆ భవనంలో ఎవరూ లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. వీటిన్నింటిపై పర్యవేక్షణ కొరవడం కారణమన్న విమర్శలున్నాయి. ఇకనైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- వెదురుకుప్పం, ఆంధ్రజ్యోతి



రహదారి పరిస్థితి



కార్యాలయ దుస్థితి

కొత్త టీచర్లకు కౌన్సెలింగ్ చిక్కులు



ఎస్జీటీకి పాఠశాల కేటాయింపు పత్రం అందజేస్తున్న ఆర్జేడీ, డీఈవోలు

ఎస్జీటీలకు మాన్యువల్, ఎస్ఏలకు వెబ్ కౌన్సెలింగ్ ● రాత్రి వేళ తిరుపతిలో అయ్యోర్ల పడిగాపులు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):మూడు రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించబోయే వారికి కౌన్సెలింగు ప్రారంభంలో చిక్కులు ఎదురయ్యాయి.సెకండరీ గ్రేడ్ టీచర్లు పోస్టింగ్ కౌన్సెలింగు కోసం తిరుపతిలో గురువారం రాత్రి పడిగాపులు కాయాల్సి వచ్చింది.డీఎస్సీ ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1403మంది ఉద్యోగం పొందారు. వీరిలో 1394 మంది ఈనెల 3నుంచి చిత్తూరు, తిరుపతి కేంద్రాల్లో శిక్షణా తరగతులకు హాజరు కాగా,తొమ్మిదిమంది గైర్హాజరయ్యారు.తిరుపతి నగరం జీవకోనలోని విశ్వం స్కూల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు గురువారం రాత్రి 11గంటల తరువాత మాన్యువల్ కౌన్సెలింగ్ ప్రారంభిం చారు.ఆర్జేడీ శామ్యూల్, తిరుపతి డీఈవో కేవీఎన్ కుమార్, చిత్తూరు డీఈవో బి.వరలక్ష్మి కౌన్సెలింగ్‌ను పర్యవేక్షించారు. ఒకటి నుంచి 250మంది ఉపాధ్యాయులకు కౌన్సెలింగు పూర్తి చేస్తారు.శుక్రవారం 251నుంచి 700వరకూ తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంలోని మెడ్జ్ స్కూల్లో, 701నుంచి 922వరకూ గూడూరులోని ఆదిశంకరా ఇంజనీరింగు కళాశాలలో మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.కాగా కొత్త ఉపాధ్యాయులకు శుక్రవారంతో శిక్షణ తరగతులు ముగియనున్నాయి. గురు,శుక్రవారాల్లో కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలను కేటాయిస్తారు.వీరంతా సోమవారం విధుల్లో చేరాల్సి ఉంది.పాఠశాల కేటాయింపుల కౌన్సెలింగ్ ప్రక్రియలో గురువారం గందరగోళం నెలకొంది. 917 మంది ఎస్జీటీ అభ్యర్థులకు బుధవారం నుంచి తొలుత వెబ్ కౌన్సెలింగ్ అంటూ చెప్పిన అధికారులు, గురువారం సాయంత్రానికి ఆ ప్రక్రియను మాన్యువల్‌గా మార్చారు. స్కూల్ అసిస్టెంట్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ అంటూ చివరికి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు.ఇందుకు సంబంధించి ఎస్ఏలకు ఖాళీలను ఎంచుకునేందుకు వెబ్ ఆప్షన్లు ఇచ్చారు.

పూర్తి ఖాళీలు చూపని వైనం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇటీవల ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించారు. కౌన్సెలింగ్ ద్వారా సీనియారిటీ జాబితా ఆధారంగా,ఉపాధ్యాయులు స్థానాలు కోరుకుని విధుల్లో చేరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విద్యాశాఖలో క్లియర్ వేకెన్సీలు వచ్చేశాయి. అయితే కొత్తగా వచ్చే ఉపాధ్యాయులకు క్లియర్ వేకెన్సీలు పూర్తిగా చూపించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. హెచ్ఆర్ఏ ఒకటి, రెండు కేటగిరీల ఖాళీలు చూపకుండా, కేవలం హెచ్ఆర్ఏ మూడు, నాలుగు కేటగిరీల వేకెన్సీలు చూపుతున్నారు. దీంతో కొత్త ఉపాధ్యాయులకు మండల స్థాయి, మారుమూల గ్రామీణ ప్రాంత పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితులు వచ్చాయి.1394మంది ఉపాధ్యాయులకు 1:1 ఖాళీలు మాత్రమే చూపుతున్నారు. అంటే 1394 స్థానాలనే వేకెన్సీలుగా చూపుతున్నారు. కాగా ఒకటి రెండు కేటగిరిలైన మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలల్లో ఏకంగా 500 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా వున్నట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించినా, వీటిని కౌన్సెలింగ్‌లో చూపకపోవడంపై విమర్శలు వచ్చాయి.



కౌన్సెలింగ్‌కు హాజరైన సెకండరీ గ్రేడ్ టీచర్లు

రాత్రి 11గంటల తరువాత మొదలైన కౌన్సెలింగ్

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొత్తగా ఎంపికైన 917మంది ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం రాత్రి 11గంటల తరువాత తిరుపతిలో మొదలైంది. వాస్తవానికి సాయంత్రం 5 గంటలకు మొదలు పెట్టి రాత్రి 11 గంటలకు ముగించాలని రాష్ట్రస్థాయి అధికారులు సూచించారు. మరో వైపు ఖాళీల జాబితా ప్రచురించడంలోనూ విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించడం ఉపాధ్యాయుల్ని నిరాశకు గురిచేసింది. సెకండరీ గ్రేడ్ టీచర్లు మొత్తంగా 917మంది ఉన్నారు. ఎస్జీటీ (తెలుగు)లో 753మంది మండల పరిషత్ స్థాయిలో ఎంపిక కాగా, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 75మంది, మున్సిపాలిటీ పరిధిలో 53మంది, ఎస్జీటీ (ఉర్దూ)లో ఎంపీపీ స్థాయిలో 30మంది, మున్సిపాలిటీలో ఒకరు, ఎస్జీటీ (తమిళం)లో ఎంపీపీ పరిధిలో ఎంపికైన ఉపాధ్యాయులు ఐదుగురు ఉన్నారు.

నేటినుంచి టీచర్ల యాప్‌డౌన్

బోధనేతర పనులు తగ్గించాలని డిమాండు



యాప్‌డౌన్ నోటీసును డీఈవో వరలక్ష్మికి అందజేస్తున్న టీచర్లు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):బోధనేతర పనులు తగ్గించాలని డిమాండు చేస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం నుంచి పాఠశాలల్లో యాప్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా ఫ్యాప్టో నాయకులు గురువారం డీఆర్వో మోహన్‌కుమార్‌కు, డీఈవో వరలక్ష్మికి, మండల స్థాయి నాయకులు ఎంఈవోలకు నోటీసులు ఇచ్చారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం పనులు మినహా బోధనేతర కార్యక్రమాలను తాము చేయమన్నారు. జవాబు పత్రాల మూల్యాంకనం, గూగుల్ షీట్లు నింపడం, విద్యాశక్తి, జీఎస్టీ 2.0 ప్రచారం నిలిపేస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు వివరించారు.ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మణిగండన్, ప్రధాన కార్యదర్శి మునీర్, నాయకులు చెంగల్రాయ మండడి, జీవీ రమణ, మదనమోహన్‌రెడ్డి, కిరణ్ కుమార్, జగదీష్, ప్రభాకర్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



వర్షంతో వి.కోట ప్రధాన రహదారిలో నిలిచిన నీరు

పిడుగుల వర్షం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల గురువారం రాత్రి 8 గంటల నుంచి 9 గంటల వరకు పిడుగులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, గుడిపాల, యాదమరి, పెనుమూరు, పూతలపట్టు మండలాల్లో భారీ వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో ముందస్తుగా అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేసారు. చిత్తూరు నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శుక్రవారం కూడా జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం, విపత్తు నిర్వహణ సంస్థలు హెచ్చరించాయి. మరోవైపు అల్పపీడన ద్రోణి ప్రభావంతో గడిచిన 24గంటల్లో 16 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా వెదురుకుప్పంలో 68.4 మిమీ, అత్యల్పంగా బంగారుపాళ్యం, రొంపిచెర్ల మండలాల్లో 1.4 మిమీ చొప్పున వర్షపాతం నమోదయ్యింది. మండలాలవారీగా బైరెడ్డిపల్లెలో 38.4, పూతలపట్టులో 30.2, పెనుమూరులో 26.8, వి.కోటలో 26.6, పులిచెర్లలో 25, శ్రీరంగరాజపురంలో 16.2, కుప్పంలో 9.6, సోమల, సదుం మండలాల్లో 4.6, నింద్రలో 4.2, పుంగనూరులో 3.2, గుడుపల్లెలో 2.8, తవణంపల్లెలో 2.6 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

హిడెన్ కెమెరా పెట్టిన ఇంజనీరుపై కేసు

చిత్తూరు రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చిత్తూరు సమీపంలోని ఓ యూనివర్సిటీలో ఇటీవల గర్ల్స్ టాయిలెట్‌లో హిడెన్ కెమెరా పెట్టిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో గురువారం 'గర్ల్స్ టాయిలెట్‌లో హిడెన్ కెమెరా కలకలం' శీర్షికన వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై ఎస్పీ తుషార్ డూడి స్పందించారు.పోలీసులను గురువారం యూనివర్సిటీకి పంపారు. జరిగిన ఘటనపై విద్యార్థులను, అధ్యాపకులను వారు విచారించారు.కెమెరా అమర్చిన ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం టాయిలెట్‌లో ఉంచి వీడియో చిత్రీకరణకు ఉపయోగించిన ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే అందులోని వీడియోలు, డేటాను అప్పటికే డిలీట్ చేసి వుండడంతో రికవరీకి పంపించినట్లు పోలీసులు వివరించారు. టాయిలెట్‌లో హిడెన్ కెమెరా పెట్టిన కందరూబెన్(27)పై చిత్తూరు తాలుకా పోలీసులు కేసు నమోదు చేశారు.యూనివర్సిటీ ప్రాంగణంలో జరుగుతున్న భవన నిర్మాణ పనులకు సైట్ ఇంజనీరుగా ఇతడు పనిచేస్తున్నాడు.తమిళనాడు రాష్ట్రం రాజపాళయం తాలుకా, తంగలింగాపురం గ్రామానికి చెందిన వాడిగా పోలీసులు గుర్తించారు.

నేడు ఎస్వీయూ కొత్త వీసీ బాధ్యతల స్వీకరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ నూతన వీసీగా ప్రొఫెసర్ నరసింగరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. హైదరాబాదు నుంచీ ఉదయం తిరుపతికి చేరుకుని, ఓ అధికారిక ఆన్‌లైన్ మీటింగ్‌లో పాల్గొననున్నారు. ఆ తర్వాత వీసీగా బాధ్యతలు చేపట్టనున్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లను రిజిస్ట్రార్ భూపతి నాయుడు నేతృత్వంలోని అధికార యంత్రాంగం పూర్తి చేసింది.

లాడ్జీలపై పోలీసుల మెరుపు దాడులు

ఐదుగురిపై కేసు నమోదు - 14రోజుల రిమాండ్ విధించిన కోర్టు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని పలు లాడ్జీలపై బుధవారం రాత్రి పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. వివరాలను గురువారం ఒకటో పట్టణ సీఐ మహేశ్వర తెలియజేశారు. నగరంలోని వినాయక లాడ్జిపై దాడి చేసి.. నిర్వాహకుడు వెంకటేష్, రూమ్ బాయ్ రవితోపాటు ముగ్గురు మహిళలను, విటుడు అజీమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అలాగే గణేష్ లాడ్జిపై దాడి చేసి.. మేనేజర్ ఉమాపతి, రూమ్ బాయ్ సురేంద్రబాబుతో పాటు రూముల్లోని ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. మాధవ అనే వ్యక్తి పారిపోయాడు. విచారించగా.. మహిళలంతా హైదరాబాదు, శ్రీకాకుళం, నెల్లూరు, విజయవాడ నుంచి కూలి పనుల కోసం ఇక్కడికి వచ్చినట్లు గుర్తించారు. వీరికి డబ్బు ఆశ చూపి వ్యభిచారం చేయిస్తున్నట్లు తేలడంతో వెంకటేష్, రవి, ఉమాపతి, సురేంద్రబాబు, విటుడు అజీమ్‌లపై కేసు నమోదు చేసి గురువారం రాత్రి కోర్టులో హాజరు పరిచారు. నిందితులకు నాల్గవ అదనపు కోర్టు 14రోజులపాటు రిమాండ్ విధించింది.

సదరన్ డిస్కం సీఎండీగా శివశంకర్



తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం సీఎండీగా లోతేటి శివశంకర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న సీఎండీ కె.సంతోషరావు రెండు రోజులుగా రాష్ట్ర స్థాయి సమావేశాల నిమిత్తం విజయవాడలో ఉన్నారు. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. కాగా, సీఎండీగా నియమితులైన శివశంకర్, గతంలో కడప కలెక్టర్‌గా పనిచేసే సమయంలో ఐఏఎస్‌ల విభజన జరిగింది. అప్పట్లో తెంగాణకు బదిలీ అయ్యారు. సొంత రాష్ట్రంలో సేవలందించాలన్న సంకల్పంతో క్యాట్, న్యాయస్థానాలను ఆశ్రయించి తిరిగి ఏపీకి కేటాయించుకున్నారు. గతంలో పాడేరు సబ్ కలెక్టర్‌గాను, ఐటీడీఏ పీవోగాను పనిచేశారు. అనంతరం పల్నాడు తొలి కలెక్టర్‌గా పనిచేశారు. 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శివశంకర్‌ది విజయనగరం జిల్లా ధర్మవరం. ఇంజనీరింగ్ పూర్తి చేశాక ఏసీటీవోగా పనిచేస్తూ ఐఏఎస్ అయ్యారు.

పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా తిరుపతి జేసీ



శుభమ్ బన్సల్

తిరుపతి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సల్ బదిలీ అయ్యారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా ఆయన పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. జూనియర్ అధికారి అయినప్పటికీ చాలా కీలక పోస్టింగ్ అందుకున్నారు. గతేడాది జూలై 24న జేసీగా బాధ్యతలు తీసుకున్న ఈయన ప్రజలతో, ప్రజాప్రతినిధులతో పెద్దగా మమేకం కాలేకపోయారు. భూసేకరణ, ఇతర భూ అంశాలకు సంబంధించి తొందరపడి ఫైళ్లు క్లియర్ చేస్తే వివాదాల్లో చిక్కుకుంటామేమోనన్న అనుమానంతో జాప్యం చేయడంతో పెండింగ్ పడుతూ వచ్చాయి. అదే సమయంలో జిల్లాలో పారిశ్రామిక, జాతీయ రహదారులపరంగా భూసేకరణ విషయాల్లో చురుగ్గా పనిచేశారు. పారిశ్రామికంగా జిల్లా కీలక స్థానంలో ఉన్న నేపథ్యంలో జేసీగా శుభమ్ బన్సల్ పనితీరును, ఆయన అవగాహనను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం కీలకమైన పరిశ్రమల శాఖకు డైరెక్టర్‌గా బదిలీ చేసింది. గతంలోనే నియమించాలని ప్రయత్నించినా జిల్లాలో ఆయన అవసరం ఉందంటూ కలెక్టర్ వెంకటేశ్వర్ అభ్యర్థించడంతో ఆ ప్రతిపాదనను విరమించుకుంది. కాగా, జిల్లాకు ఎవరినీ జేసీగా నియమించలేదు.

ఎమ్మెల్యే థామస్‌పై అనుచిత వ్యాఖ్యలు

● వైసీపీ సర్పంచి భర్తపై పోలీసులకు ఫిర్యాదు

శ్రీరంగరాజపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ పురం మండల కేంద్రానికి చెందిన సర్పంచ్ హరిత భర్త కుప్పయ్య స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో ఎమ్మెల్యే థామస్‌పై గురువారం అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేపై కుప్పయ్య వ్యక్తిగత దూషణలు చేయడంతో టీడీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కుప్పయ్యను పోలీసులు అదుపులోకి తీసుకోగా, విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నారాయణస్వామి స్టేషన్ వద్దకు వచ్చారు. ఎస్ఐ సుమన్‌తో మాట్లాడగా, కుప్పయ్యకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఇదిలా ఉండగా, వెంకటాపురం సర్పంచ్ ఏకాంబరం.. కుప్పయ్య మాట్లాడిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. దాంతో ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న ఏకాంబరంపై టీడీపీ నాయకులు ఘర్షణకు దిగినట్లు సమాచారం. ఎస్ఐ ఏకాంబరాన్ని స్టేషన్‌కు పిలుచుకుని వెళ్లి అతను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన వాటిని తొలగింపజేశారు. ఎవరైనా రెచ్చగొట్టే పోస్టులను వైరల్ చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

రైల్లో నుంచి జారిపడి ఇంటర్ విద్యార్థి మృతి

నాయుడుపేట టౌన్/వరదయ్యపాళెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో రైల్లో నుంచి జారిపడి ఇంటర్ విద్యార్థి సంతోష్(17) మృతి చెందాడు. వరదయ్యపాళెంలోని బజారు వీధిలోని పరంధామయ్య కుమారుడు సంతోష్ నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల దసరా సెలవులకు ఇంటికి వచ్చిన ఇతడు.. తిరిగి కళాశాలకు వెళ్ళేందుకు తడలో రైలు ఎక్కాడు. నాయుడుపేట స్టేషన్ సమీపంలో రైల్లో నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


సంతోష్ (ఫైల్ ఫొటో)

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ రామాంజనేయులు, సినీ దర్శకుడు వీవీ వినాయక్, నటి రోహిణి, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, తెలంగాణ శివశక్తుల సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ శ్యామలాదేవి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



వివి వినాయక్ - రోహిణి


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.93 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 74,861

తలనీలాలు సమర్పించినవారు: 31,802





తరునీష్ జత్యా

ఇష్టపడిన రంగంలో కష్టపడితే ఫలితాలెలా ఉంటాయో నిరూపిస్తున్నాడు తరునీష్ జత్యా. తనకు నచ్చిన విలువిద్యపై ఫోకస్ పెట్టి బాణంలా దూసుకుపోతున్నాడీ కుర్రాడు. అర్జునుడిలా విల్లు ఎక్కు పెట్టి లక్ష్య ఛేదనలో చక్కగా రాణిస్తున్నాడు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతూ పతకాలను సొంతం చేసుకుంటున్నాడు.

- గూడూరు, ఆంధ్రజ్యోతి

గురి తప్పని తరునీష్

- విలువిద్యలో చక్కని ప్రతిభ
- ఒలింపిక్ లక్ష్యంగా పరిశ్రమ



డబుల్ గోల్డ్ మెడల్స్‌తో...

గూడూరు పట్టణంలోని ధూర్జటినగర్ ప్రాంతానికి చెందిన కోదండపాణి, సత్య దంపతుల కుమారుడు తరునీష్ జత్యా. కోదండపాణి టీవీ మెకానిక్‌గా పనిచేస్తూ కుమారుడ్ని ఏదో క్రీడలో గొప్పవాడిగా చూడాలని ఆశపడేవాడు. ఈ క్రమంలో గూడూరులో అర్జున్ ఆర్చరీ అకాడమీ ఏర్పాటైంది. విలువిద్యపై తరునీష్ ఆసక్తిని గమనించి 2018లో అందులో చేర్పించాడు. అప్పుడు 5వ తరగతి చదువుతున్న తరునీష్ కోచ్ శివశంకర్ వద్ద నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. ప్రావీణ్యత సాధించాడు. అంకుఠిత దీక్ష, ఏకాగ్రత ఉంటేనే నిలదొక్కుకునే ఈ క్రీడలో అంచెలంచెలుగా రాణిస్తూ వస్తున్నాడు. ప్రస్తుతం సైదాపురంలోని ఓ ప్రైవేటు జూనియర్ కలాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. మరోపక్క అహ్మదాబాదులోని ఓ ఆర్చరీ అకాడమీలో నాలుగు నెలలుగా శిక్షణ పొందుతున్నాడు.

ఒలింపిక్‌లో మెడల్ లక్ష్యం

ఆర్చరీ అంటే ప్రాణం. పదో ఏడాది నుంచి ఈక్రీడపైనే దృష్టి పెట్టాను. అమ్మానాన్నలూ ప్రోత్సాహమందిస్తున్నారు. మన దేశం తరపున ఒలింపిక్ పోటీలలో పాల్గొని పతకం సాధించడమే నా ముందున్న ఏకైక లక్ష్యం. ఇందుకు పట్టుదలతో శ్రమిస్తున్నాను. అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తాననే నమ్మకముంది.

- తరునీష్ జత్యా

పదో ఏట నుంచే పతకాలు

తరునీష్ చిన్నతనం నుంచే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి ఆర్చరీ పోటీలలో ప్రతిభ చాటుతున్నాడు. గతేడాది నవంబరులో గుజరాత్‌లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో వ్యక్తిగత, ఓవరాల్ విభాగాలలో డబుల్ గోల్డ్ మెడల్స్ సాధించాడు. స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఈ కుర్రాడి ప్రతిభకు ముచ్చటపడి రూ.50 వేలు నగదు ప్రోత్సాహక బహుమతితో సత్కరించారు. ఈ ఏడాది మేలో బీహార్ జరిగిన ఖేలో ఇండియా పోటీల్లోనూ మెరిసి కాంస్య పతకం దక్కించుకున్నాడు. 2022లో రాష్ట్రస్థాయి జూనియర్స్‌లో, గతేడాది రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్‌లో మొదటిస్థానంలో నిలిచాడు. ఈయేడాది జనవరిలో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్ పోటీలలో మొదటి స్థానంలో నిలిచాడు.

సహకార రంగ అభివృద్ధికి ప్రణాళిక

- పీఏసీఎస్ వ్యాపార విస్తరణకు కృషి
- ముగింపు సదస్సులో కేంద్ర సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్ భూటాని


సదస్సుకు విచ్చేసిన వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సహకార రంగం సాంకేతిక ఆధారిత బహుముఖాభివృద్ధికి స్పష్టమైన ప్రణాళికలకు రూపకల్పన చేసినట్లు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్ భూటాని తెలిపారు. తిరుపతి తాజ్‌హోటల్‌లో రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. 'సహకార్ సే సమృద్ధి- సహకారంతో సుసంపన్నత' అంశంపై చర్చించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) కంప్యూటరీకరణ, డిజిటల్ లావాదేవీలు, బహుముఖ సేవలపై చర్చించినట్లు చెప్పారు. ఏపీలో 2,021 పీఏసీఎస్‌లను డిజిటలైజేషన్ చేసి ఈ-పీఏసీఎస్‌గా మార్చడం అభినందనీయమన్నారు. పీఏసీఎస్‌లలో నగదు రహిత లావాదేవీలు తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా పేపర్‌లెస్ వ్యవస్థలు, వన్‌స్టాప్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామీణ స్థాయిలో పాలు, మత్స్య సహకార సమాఖ్యను బలోపేతం చేస్తామని వివరించారు. అనారోగ్య సహకార సంస్థల లిక్విడేషన్‌కు బదులుగా సంస్కరణలు చేపడతామని చెప్పారు. ఈ సదస్సు విజయవంతంగా ముగియడంతో కలెక్టర్ వెంకటేశ్వర్, అధికార యంత్రాంగానికి ఆశిష్‌కుమార్ భూటాని, రాష్ట్ర సహకార కమిషనర్ బాబు అభినందనలు తెలిపారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సహకార శాఖ అధికారులతో పాటు జిల్లా అడిషనల్ రిజిస్ట్రార్ ఆనందబాబు, గౌరీశంకర్, డీసీవో లక్ష్మి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో అసత్య ప్రచారంపై

నిందితుడి అరెస్టు

- వెస్ట్ సీఐ మురళీమోహన్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేశారన్న కేసులో నిందితుడిని తిరుపతి పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వెస్ట్ సీఐ మురళీమోహన్ తెలిపిన ప్రకారం.. సత్యసాయి జిల్లా కదిరి టౌన్ జౌకుపాళ్యంకు చెందిన కౌలేపల్లి అంజాద్‌ఖాన్ సోషల్ మీడియాలో ఫేక్ ప్రొఫైళ్లను సృష్టించి వాటి ద్వారా ఇతర రాజకీయ పార్టీలు, వర్గాల మధ్య విభేదాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతున్నాడు. ఇందులో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రి లోకేశ్, నందమూరి బాలకృష్ణ గౌరవం.. మనోభావాలు దెబ్బతీసే పోస్టులు పెట్టాడు. వీరిపై అసత్య ప్రచారాలు చేసినట్లు దర్యాప్తులో తేలడంతో గురువారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం, వర్గాల మధ్య విభేదాలు రేకెత్తించే వ్యాఖ్యలు, పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మురళీమోహన్ హెచ్చరించారు.

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ

- డీఈవోకు స్పష్టం చేసిన ఫ్యాప్టో నేతలు


డీఈవోకు నోటీసు అందజేస్తున్న ఫ్యాప్టో నేతలు

తిరుపతి(విద్య), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బోధనేతర, విద్యాశక్తి కార్యక్రమాలను బహిష్కరిస్తున్నామని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అసోసియేషన్ (ఎఫ్ఏపీటీఓ) నాయకులు స్పష్టం చేశారు.ఆ మేరకు వారు గురువారం డీఈవో కేవీఎన్ కుమార్‌కు నోటీసు అందజేశారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ సురేష్, డిప్యూటీ జనరల్ రామచంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అంతకుముందు డీఆర్వోకు కూడా తమ నిర్ణయాన్ని తెలియజేశారు. ఫ్యాప్టో డిప్యూటీ జనరల్ జగన్నాథం, ఇతర నాయకులు ముత్యాలరెడ్డి, ఎస్ఎస్ నాయుడు, రవీంద్ర, వాసు, నిర్మల, మురళీకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం, మధు, రుక్మాంధ, సుబ్బారావు, పద్మజ పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో కేవీఎన్ కుమార్

తిరుపతి(విద్య), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించేందుకు చెకుముకి పేరుతో జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఏటా నిర్వహించే సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప, ఆర్థిక కార్యదర్శి బాషా, జిల్లా ఫిజికల్ సైన్స్ ఫోరం, గణిత ఫోరం సభ్యులు, ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెటర్నరీలో ముగిసిన జాతీయ సదస్సు

- 42 మందికి బహుమతుల ప్రదానం


సర్టిఫికెట్, జ్ఞాపికను అందిస్తున్న రిజిస్ట్రార్ వినూ, డీన్ బ్రహ్మయ్య, ఏడీ జగపతిరామయ్య, పక్కన వైకుంఠరావు

తిరుపతిరూరల్, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాల పశువైద్య చికిత్స, బోధన సముదాయ(వీసీసీ)విభాగ ఆధ్వర్యంలో నేషనల్ క్లినికల్ కేస్ కాన్ఫరెన్స్ ఫర్ వెటర్నరీ స్టూడెంట్స్ అంశంపై నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. 14 టెక్నికల్ సెషన్లలో పలువురు విద్యార్థులు పేపర్లు ప్రజంటేషన్ చేశారు. అత్యుత్తమ ప్రజంటేషన్ చేసిన 42మంది విద్యార్థులను విజేతలుగా ఎంపిక చేసినట్లు సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ వి.వైకుంఠరావు పేర్కొన్నారు. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వర్సిటీ రిజిస్ట్రార్ ఆర్.వినూ, డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య ప్రతిభచాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందించారు. వారు మాట్లాడుతూ వీసీసీ ఆధ్వర్యంలో ఒకే వేదికపై 14 రాష్ట్రాలకు చెందిన యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులను భాగస్వాములు చేయడం సంతోషంగా ఉందన్నారు. కాగా రూమినెంట్ మెడిసిన్ పీజీలో డాక్టర్ సాహితి, కంపానియన్ యానిమల్ మెడిసిన్ పీజీలో డాక్టర్ రజిత, వైల్డ్‌లైఫ్, ఏవియన్ ఎక్సాటిక్ పీజీలో డాక్టర్ ఎం.ప్రశాంత్‌కుమార్ (ఎస్వీవెటర్నరీ, తిరుపతి) ప్రథమ స్థానం, యూజీలో డాక్టర్ రెబెకా(పీయూఆర్ఎన్‌టీ, కోరుట్ల) బహుమతులు అందుకున్నారు. ప్రొఫెసర్లు డాక్టర్ ఎస్.ధనలక్ష్మి, డాక్టర్ ఎస్.భారతి, డాక్టర్ ఎం.రఘునాథ్, డాక్టర్ నస్రీన్ పాల్గొన్నారు.

అతిథుల కోసం..!

- రెండు బ్యాటరీ వాహనాలు కొన్న పద్మావతి యూనివర్సిటీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ రెండు బ్యాటరీ వాహనాలను కొనుగోలు చేసింది. హైదరాబాదుకు చెందిన భాగారియా ఏజెన్సీస్ నుంచీ రూ.12.6 లక్షలతో వీటిని కొనుగోలు చేసినట్టు తెలుస్తోంది. యూనివర్సిటీ చేపట్టే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి వయోభారంతో వచ్చే అతిథుల కోసం వీటిని వినియోగించనున్నారు. ఈ వాహనాలను వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని తదితరులు గురువారం ప్రారంభించారు.


బ్యాటరీ వాహనాలను ప్రారంభిస్తున్న వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని

జీఎస్టీ ఆధ్వర్యంలో నేటి నుంచి

శిల్పారామంలో భారీ సేల్స్ ఎగ్జిబిషన్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రాంతీయ జీఎస్టీ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు వివిధ రకాల వస్తువులు భారీ అమ్మకాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు జీఎస్టీ సహాయ కమిషనర్లు వరలక్ష్మి, శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపార వర్గాల సహకారంతో ఎలక్ట్రానిక్, ఇంటికి సంబంధించిన వస్తువులు, ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలు, సోలార్ పవర్ ప్యానెళ్ళు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుందన్నారు. తగ్గించిన జీఎస్టీ ధరలు, వినియోగదారులకు అదనపు లాభం చేకూర్చడం ఈ ఎగ్జిబిషన్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.


ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరి పంట

పంట పొలాలపై 'గజ'దాడులు

భాకరాపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలో పంట పొలాలపై ఏనుగుల దాడులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బుధవారం రాత్రి ఎగపూరు గ్రామానికి చెందిన అమరేంద్ర, రెడ్డెమ్మ, విజయ సారథికి చెందిన సుమారు 5 ఎకరాలలో వరి పంటను ధ్వంసం చేశాయి. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో రాత్రి పంటలను ధ్వంసం చేసి, పగలు సమీపంలోని అడవిలోకి వెళ్లిపోతున్నాయి. గురువారం రాత్రి పూజారివాండ్లపల్లె, ఈదలచెరువు, పాలమాకులపల్లె, గాండ్లపల్లి వైపు వచ్చే అవకాశం ఉందని, రైతులెవరూ పంట పొలాల వైపు వెళ్లవద్దని అటవీ శాఖాధికారులు హెచ్చరించారు. గొర్రెలు, పశువుల కాపరులు అడవిలోకి వెళ్లవద్దని సూచించారు.

డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారు

- నేను చనిపోయాక నగదు నా ఇంటికి చేర్చండి
- ఎస్వీ జూపార్కు టైమ్‌స్కేల్ ఉద్యోగి సెల్ఫీ వీడియో

మంగళం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తాను చేసిన పనులకు డబ్బులు ఇవ్వకుండా మానసికంగా వేధిస్తున్నారంటూ ఎస్వీ జూపార్కులో టైమ్‌స్కేల్ ఉద్యోగి హరియాదవ్ బుధవారం సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసిన సెల్ఫీ వీడియో సంచలనంగా మారింది. 'నేను జూపార్కులో అనేక పనులు చేశా. దీనికి రూ.11లక్షలకు నగలు కుదువబెట్టా. బిల్లులు అడిగితే ఒకసారి రూ.7.70లక్షలు, మరోసారి రూ.50వేలు, ఇంకోసారి రూ.లక్ష, ఆ తర్వాత రూ.8వేలు ఇచ్చారు. ఇంకా రూ.26లక్షలు రావాలి. ఈ బిల్లులు ఇవ్వకుండా నన్ను ఇబ్బంది పెడుతున్నారు. సహనం కోల్పోయి నేను ఆత్మహత్య చేసుకుంటే.. ఆ మొత్తాన్ని నా కుటుంబానికి అందించండి' అంటూ కన్నీటితో సెల్ఫీ వీడియో పెట్టారు. ఈ వ్యవహారంపై ఏసీబీ విచారణ జరపాలని డిమాండు చేశారు. దీనిని చూసిన వారంతా ఆందోళన చెందారు. కాగా, గురువారం హరి జూపార్కులో తన విధులకు హాజరుకావడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

అతడి అక్రమాలు బయటపడతాయనే

- అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్

హరి సెల్ఫీ వీడియోపై ఎస్వీ జూపార్కు అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్ స్పందించారు. '2023లోనే అతడు చేసిన పనులకు బిల్లులను చెల్లించాం. సెప్టెంబరు నెలలో హరి చేసిన పనులపై వచ్చిన ఆరోపణలకు క్యూరేటర్ సెల్వం ఏసీఎఫ్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ వేశారు. అతడి వద్ద బిల్లులు ఏవైనా ఉంటే ఇవ్వాలని కమిటీ కోరినప్పుడు.. నా వద్ద ఏమీ లేదని అతడు రాతపూర్వకంగా రాసిచ్చారు. హరి చేసిన పనుల్లో జరిగిన అవకతవకలు బయటపడతాయని భయపడి ఇలా చేసి ఉంటారు' అని జగదీష్ చంద్రప్రసాద్ తెలిపారు. జూపార్కు క్యూరేటర్ ఆదేశాలతో దీనిపై లోతైన విచారణ జరిపి అతడిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఏర్పేడు పీఏసీఎస్‌కు సిక్కిం ప్రతినిధులు



పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఉన్న సిక్కిం సహకార శాఖ ప్రతినిధులు తదితరులు

ఏర్పేడు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని (పీఏసీఎస్) గురువారం సిక్కిం రాష్ట్ర ప్రభుత్వ సహకార శాఖ కార్యదర్శి గ్లోరియా నాంచ్, అదనపు రిజిస్ట్రార్ కేశాంగ్ యాంకీ తదితరులు సందర్శించారు. తిరుపతిలో సదస్సుకు హాజరైన వీరు చివరి రోజు ఏర్పేడు పీఏసీఎస్‌కు వెళ్లారు. అక్కడి వ్యాపార లావాదేవీలను, ఈకేవైసీ నమోదు, రుణపంపిణీ, హార్డ్‌వేర్ కిట్లు తదితరాలను పరిశీలించారు. టెక్నాలజీ వినియోగం గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి నాగవర్ధన, అధికారులు సురేష్‌కుమార్, నాగభూషణం, సంధ్యారాణి, తేజస్విని, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలేశ్వరుడి దర్శనానికి వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో షార్ ఉద్యోగి దుర్మరణం


సురేష్ బాబు (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు అరుణాచలేశ్వరుడి దైవ దర్శనానికి వెళ్లిన షార్ ఉద్యోగి పగడాల సురేష్ బాబు(45) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. శ్రీహరికోటలోని సతీష్ థావన్ స్పేస్ సెంటర్ షార్ వాల్ఫ్ విభాగంలో సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సురేష్ బాబు కుటుంబం సూళ్లూరుపేటలోని షార్ ఉద్యోగుల కాలనీ డీఆర్‌డీఎల్‌లో నివాసం ఉంటోంది. మంగళవారం విధులు ముగిశాక ఆ రోజు రాత్రి పౌర్ణమి కావడంతో ఇంటి నుంచి మోటారు సైకిల్‌పై అరుణాచలానికి బయలుదేరి వెళ్లాడు. ఆలయానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో బుధవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తమిళనాడు పోలీసులు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు లభ్యం కాకపోవడంతో మోటారు సైకిల్ నెంబరు ఆధారంగా అడ్రసు గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. బంధువులు వెంటనే షార్ అధికారులకు తెలియజేశారు. షార్ అధికారులు, కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాదం జరిగిన ప్రదేశానికి బుధవారం రాత్రి చేరుకున్నారు. తమిళనాడు పోలీసులు గురువారం పోస్టుమార్టం పూర్తి చేయించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. సహచర ఉద్యోగులతో కలిసిమెలిసి ఎంతో సఖ్యతగా ఉండే సురేష్ బాబు మృతి చెందాడన్న విషయం తెలియగానే షార్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. శివయ్య దర్శనం కోసం బయలుదేరి అనంతలోకాలకు వెళ్లావా.. అంటూ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

మళ్లీ మోదీ వస్తే రాజ్యాంగం కనుమరుగు

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

వరదయ్యపాళెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశంలో రాజ్యాంగం కనుమరుగై ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆందోళన వ్యక్తంచేశారు. వరదయ్యపాళెంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులకు నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ తరగతులకు గురువారం ఆయన హాజరయ్యారు. అంతర్జాతీయ రాజకీయ పరిణామాలను సభ్యులకు వివరించారు. ప్రపంచ దేశాల మధ్య యుద్ధ వాతావరణం సృష్టించి లాభం పొందాలని అమెరికా ప్రయత్నిస్తోందని విమర్శించారు. దేశంలో సహజ వనరులను వినియోగించుకోవడంలో మోదీ ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్రాల్లోని బీజేపీయేతర ప్రభుత్వాలకు కేంద్రం సరిపడా నిధులు ఇవ్వడంలేదన్నారు. మోదీ ప్రభుత్వం రాజకీయ పార్టీలను బ్లాక్‌మెయిల్ చేస్తూ ఎదురు తిరిగితే జైల్లో పెడుతున్నారని ఆరోపించారు. దేశంలో లడఖ్‌తో తిరుగుబాటు మొదలైందన్నారు.దీని ప్రభావం అన్ని రాష్ట్రాల మీదపడుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామీణ స్థాయినుంచి సీపీఐని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. బలమైన పార్టీ నిర్మాణం ఆవశ్యకత అంశంపై జేవీఎస్ మూర్తి, భారత దేశ చరిత్ర, సంస్కృతి, వక్రీకరణపై కొప్పర్తి వెంకట రమణమూర్తి ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామానాయుడు,నాయకులు పి.మురళి, చిన్నిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

'గజ-ప్రజ' యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలి

● డీఆర్వో మోహన్ కుమార్



వర్క్‌షాప్‌లో సూచనలిస్తున్న డీఆర్వో మోహన్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): 'ఏనుగుల కారణంగా జరుగుతున్న పంట నష్టాలను 'గజ-ప్రజ' యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. దీనిపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి' అని డీఆర్వో మోహన్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్వో సమావేశ మందిరంలో గజ-ప్రజ యాప్ డెమోను అధికారులతో కలిసి ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ.. రైతులు తమ వ్యవసాయ పంటనష్టాలను నివేదించడానికి, పరిహారాలు ప్రభుత్వం నుంచి వేగంగా పొందడానికి ఈ యాప్ ఎంతో సహకరిస్తుందని చెప్పారు. ఈ యాప్‌ను ఉపయోగించి రైతులు తమ పంటనష్టాల వివరాలను ఫొటోలతోపాటు నేరుగా ఫోన్ నుంచే అప్‌లోడ్ చేయవచ్చని సూచించారు. పరిహార క్లెయిమ్‌లను వారం గడువులోగా పరిష్కరించడానికి సహాయపడుతుందన్నారు. ఈ యాప్‌ను త్వరలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ వర్క్‌షాప్‌లో వైల్డ్‌లైఫ్ ఎక్స్‌పర్ట్ రాకేష్ కల్వ, పలమనేరు ఆర్డీవో భవాని, సబ్-డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్ వేణుగోపాల్, చిత్తూరు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పట్టాభి, పుంగనూరు ఫారెస్ట్ ఆఫీసర్ శ్రీరాములుతో పాటు రెవెన్యూ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

మామిడి రైతుల భావప్రకటన స్వేచ్ఛ హరిస్తారా?

చిత్తూరు, సెంట్రల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతుల భావ ప్రకటన స్వేచ్ఛను హరించడం హేయమైన చర్యని ఆ సంఘం చైర్మన్ జనార్దన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధర చెల్లించాలని కోరుతూ ఈనెల 15వ తేదీన అఖిలపక్షం ఆధ్వర్యంలో బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో తలపెట్టిన రైతుల ఆక్రందన సభకు అధికారులు అనుమతి ఇవ్వకపోవడం అప్రజాస్వామికమన్నారు. కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలతో మామిడి రైతులకు న్యాయం చేయడంపై రివ్యూ మీటింగ్ పెట్టాలని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిబాబు, ఆనందనాయుడు కోరారు.

పాలీహౌస్ సాగుతో లాభాల పంట



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం, కలెక్టర్ తదితరులు

కుప్పం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పాలీహౌస్ సాగుతో రైతులు లాభాల పంట పండించవచ్చని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్. మునిరత్నం, కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.మునిరాజు అన్నారు. కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (పువ్వులు, కూరగాయలు)లో గురువారం కుప్పం ఉద్యానశాఖ, సీడ్ ఏపీ సంయుక్త ఆధ్వర్యంలో పాలీహౌస్ సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పాలీహౌస్ సాగుతో వచ్చే అధిక దిగుబడులు, నాణ్యమైన పంటలతో చేకూరే లాభాల గురించి నిపుణులు రైతులకు వివరించారు. పాలీహౌస్ సాగు చేయాల్సిన పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు, సీడ్ ఏపీ అధికారులు, కుప్పం నియోజకవర్గ రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాలుజారి మరుగుదొడ్డిలో పడ్డ విద్యార్థి

● కడుపులో నుంచి బయట పడ్డ పేగులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రదీప్

చౌడేపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఓ విద్యార్థి మరుగుదొడ్డిలో కాలు జారి పడటంతో కడుపులో నుంచి పేగులు బయట పడ్డ సంఘటన చౌడేపల్లె మండలంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. బూటకపల్లెకు చెందిన మల్లిఖార్జున కుమారుడు ప్రదీప్(8) అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. స్కూల్ పక్కనే ఉన్న ఓ ఇంట్లో అయప్పస్వామి పూజ జరుగుతుండగా ప్రదీప్ చూసేందుకు మరుగుదొడ్డిలోకి వెళ్లి చూసేందుకు ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో జారిపడిన విద్యార్థికి విరిగిన పింగాని పెంకులు గుచ్చుకున్నాయి. కేకలు విన్న ఉపాధ్యాయులు గుర్తించి దాదేపల్లెలోని ఓ ప్రైవేటు క్లీనిక్‌లో చికిత్సలు అందించారు. కడుపు లోనుంచి పేగులు బయటకు వచ్చాయని గుర్తించి ద్విచక్రవాహనంలోనే స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్సలు అందించి మదనపల్లె ఏరియా ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు.



బంగారుపాళ్యం మండలం జంబువారిపల్లెలో ఇంటింటా చెత్త సేకరణ దృశ్యం

స్వచ్ఛత పరుగు .... పల్లె నుంచే అడుగు

● ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించేలా ప్రణాళిక

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో వందశాతం స్వచ్ఛత సాధన దిశగా అడుగులు పడుతున్నాయి. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ అమలుకు రంగం సిద్ధమైంది. కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్లను (సీఆర్పీలను) ఇందులో భాగస్వాములను చేయనున్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన సీఆర్పీలకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు.ప్రతి వెయ్యి కుటుంబాలకు ఒక సీఆర్పీని నియమించారు. గృహాలకు వెళ్లి ఇంట్లో ఉత్పత్తయ్యే చెత్తను వేరుచేయడంపై గృహస్థులకు అవగాహన కల్పిస్తారు.రోజూ 50 కుటుంబాలను కలసి అన్నింటినీ వివరిస్తారు. 20 రోజుల్లో వెయ్యి కుటుంబాలను కలసి పనిచేసినందుకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం ఇస్తారు.ఉత్తమ సేవలందించే సీఆర్పీలకు ప్రోత్సాహకాలు అందించనున్నారు. 2026 జనవరిలో తనిఖీ బృందాలు క్షేత్రస్థాయిలో వీరి స్వచ్ఛత పనులను పరిశీలించనున్నాయి. తడి, పొడి చెత్త వేరుచేసి హరిత రాయబారులకు (గ్రీన్ అంబాసిడర్స్‌కు) అందించే ప్రక్రియలో ప్రగతిని మదిస్తారు. సంతృప్తికరమైన సేవలందించినవారికి ఫిబ్రవరిలో ప్రోత్సాహకాలు అందించనున్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఘటనలో నారాయణ స్వామినీ అరెస్టు చేయాలి

● జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ డిమాండు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

చిత్తూరు సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : దళిత ద్రోహి మాజీ సీఎం జగన్ రెడ్డి అని గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే థామస్ ధ్వజమెత్తారు. వెదురుకుప్పం మండలంలోని దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహం కాలిన ఘటనను నిరసిస్తూ చిత్తూరులో గురువారం గాంధీ విగ్రహం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా థామస్ మాటాడుతూ వైసీపీ నేతలు అంబేద్కర్ విగ్రహానికి హాని చేసి దాన్ని టీడీపీపై మోపేందుకు చేసిన ప్రయత్నం బెడిసి కొట్టిందన్నారు. ఈ కుట్రను పోలీసులు లోతుగా విచారణ జరిపి ప్రధాన సూత్రధారి అయిన వైసీపీ సర్పంచ్ గోవిందయ్యను అరెస్టు చేశారన్నారు. ఈ సంఘటనకు గోవిందయ్యను ప్రేరేపించిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామిని కూడా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రిజర్వేషన్ల భిక్షతో మంత్రి అయిన నారాయణస్వామి ఆయనకే ద్రోహం తలపెట్టడం దారుణమన్నారు. వైసీపీ నేతలు ఏదో రకంగా టీడీపీపై బురదజల్లేందుకు ప్రయత్నించి, చివరకు వారే బురదగుంటలో పడుతున్నారని ఎద్దేవా చేశారు. వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా దీటుగా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఎడ్.. వెరీ డిమాండ్

'పద్మావతి' వర్సిటీ దూరవిద్యలో 500 సీట్లకు 2,500 మంది హాజరు



బీఎడ్ కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థినులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం ఇన్ సర్వీసు బీఎడ్ కోర్సుకు డిమాండ్ పెరుగుతోంది. ఉద్యోగులు పదోన్నతుల కోసం రెండేళ్ల కాల పరిమితి గల ఈ కోర్సులో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారు. 2019 వరకు ఇయర్లీ పాట్రెన్ పరీక్షలతో ఈ కోర్సు నిర్వహించేవారు. అయితే, డిస్టెన్స్ ఎడ్యుకేషనల్ బోర్డు (డెబ్) సెమిస్టర్ విధానంలో ఈ కోర్సు నిర్వహించాలనే నిబంధన పెట్టింది. దీంతో 2019 తర్వాత ఈ కోర్సు కొనసాగలేదు. సెమిస్టర్ విధానానికి అవసరమైన సిలబస్ రూపకల్పన, ఇతర ఏర్పాట్లు చేయడంతో కోర్సు నిర్వహణకు డెబ్ అనుమతించింది. ఆ యూనివర్సిటీలోని ఇందిరా ప్రియదర్శినీ ఆడిటోరియంలో గురువారం అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టారు. 500 సీట్లకు ఏకంగా 2,500 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసినట్లు దూరవిద్యా విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ అరుణ తెలిపారు.

ఎస్వీయూ ఎంసీఏ విభాగాధిపతిగా విజయలక్ష్మి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఎంసీఏ విభాగాధిపతిగా కె.విజయలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ భూపతి నాయుడు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనుంది. ఈ క్రమంలో ఎంసీఏ విభాగాధిపతిగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు అధ్యాపకులు అభినందించారు.

ఎట్టకేలకు కలిశారు

తిరుపతి ఎమ్మెల్యే ఇంటికి సుగుణమ్మ

స్థానికాలయాల కమిటీపై చర్చ



ఎమ్మెల్యే ఆరణి ఇంటి వద్ద సుగుణమ్మ, కూటమి నేతలు

తిరుపతి, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ మధ్య గురువారం ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఎన్జీవో కాలనీలోని ఆరణి నివాసానికి సుగుణమ్మ తన అనుచరులతో కలిసి వెళ్లి ఆత్మీయంగా పలకరించుకోవడం రాజకీయవర్గాల్లో చర్చ సాగింది. కూటమి పొత్తుల్లో భాగంగా తిరుపతి ఎమ్మెల్యే సీటు జనసేనకు కేటాయించడంతో సుగుణమ్మ వర్గంలో అసంతృప్తి నెలకొన్న విషయం తెలిసిందే. ఎన్నికల ఫలితాల అనంతరం కూడా వీరు ఎడముఖం, పెడముఖంలా ఉంటున్నారన్న ప్రచారముంది. దీంతో నామినేటెడ్ పదవుల పంపకాల్లోనూ ఆలస్యం, సమష్టి నిర్ణయం తీసుకోలేకపోవడం వంటి విమర్శలు వచ్చాయి. దీనిపై అధిష్ఠానం జోక్యం చేసుకున్నట్లు తెలిసింది. కలిసి పని చేసుకోవాలని, పొత్తు ధర్మం పాటించాలని సూచించినట్టు సమాచారం. తిరుపతిలో త్వరలో భర్తీకానున్న స్థానికాలయాలైన శ్రీవేశాలమ్మ, అంకాళమ్మ, పెదగంగమ్మ, కల్యాణ వెంకటేశ్వర ఆలయాల పాలకమండళ్లతో పాటు ఇతర నామినేటెడ్ పదవుల పంపకాలు సమష్టిగా నిర్ణయం తీసుకోవాలని భావించారు. ఈ క్రమంలో సుగుణమ్మ ఎమ్మెల్యే నివాసానికి వెళ్లారు. భర్తీ చేయాల్సిన పదవులపై చర్చించారు. కూటమి విజయానికి కృషి చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా చెప్పినట్టు తెలిసింది. నగరాభివృద్ధికి కలిసి పనిచేయాలని ఇరువురూ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కూటమి నాయకులు పుష్పావతి యాదవ్, దంపూరు భాస్కర్ యాదవ్, రాజారెడ్డి, బ్యాంకు శాంతమ్మ, చినబాబు, బుల్లెట్ రమణ, బిజీ కృష్ణ యాదవ్, మన్యం శ్రీనివాసులు, మునిశేఖర్ రాయల్, ఆర్సీ శ్రీనివాసులు, నారాయణ, రాజారాం, విశ్వనాథం, జగదీష్, కుప్పయ్య, కోటేశ్వరరావు, గంగులయ్య, రామచంద్రారెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తుడాకు ఏడీబీ సహకారం



ఏడీబీ పీవోతో తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి

తిరుపతి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)కు ఏసియన్ డెవలప్మెంట్ బ్యాంక్ (ఏడీబీ) సహకారం అందించనుందని చైర్మన్ దివాకర్ రెడ్డి చెప్పారు. న్యూఢిల్లీలో జరిగిన ఎరైజ్ సిటీస్ ఫోరం-2025 సదస్సులో దివాకర్ పాల్గొన్నారు. ఏడీబీ సౌత్ ఆసియా డిపార్ట్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రత్యూష్ కాంత్‌ను గురువారం కలుసుకున్నారు. తుడా పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళికలు, కొత్త అంతర్జాతీయ నిధుల సమీకరణ అవకాశాలపై చర్చించారు. ఏడీబీ ద్వారా ఆర్థిక, సాంకేతిక సహకారం అందించే మార్గాలపై సానుకూల నిర్ణయం తీసుకున్నట్టు తుడా చైర్మన్ మీడియాకు వెల్లడించారు. తుడా చేపడుతున్న అభివృద్ధిని ప్రత్యూష్ కాంత్ ఈ సందర్భంగా అభినందించారు.

ఎర్రచందనం స్వాధీనం



మంగళం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పుల్లంపేట వద్ద గురువారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేసి, 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ బృందం బుధవారం అన్నమయ్య జిల్లా పుల్లంపేట నుంచి కూంబింగ్ చేపట్టారు. గురువారం తెల్లవారుజామున ఎం.బావి ఫారెస్టు బీటు పరిధిలో రెడ్డిపల్లి చెరువు కట్ట వద్ద ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. టాస్క్‌ఫోర్సు సిబ్బందిని చూసి పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు అన్నమయ్య జిల్లాకు చెందిన వాడిగా గుర్తించారు. స్మగ్లర్‌ను, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఎంబీయూలో మోహనమంత్ర ప్రారంభం

చంద్రగిరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.రంగంపేట సమీపంలో గల మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో శుక్రవారం నుంచి మోహనమంత్ర కార్యక్రమం ప్రారంభమవుతుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు. ఎంబీయూ ఛాన్స్‌లర్ డాక్టర్ ఎం.మోహన్‌బాబు ప్రధాన పోషకుడిగా, ప్రొ ఛాన్స్‌లర్ మంచు విష్ణు ప్రధాన పాత్ర పోషించనున్నారు. అధ్యక్షులుగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, వైస్ ఛాన్స్‌లర్ నాగరాజరామరావ్, చీఫ్ గ్రోత్, స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్, రిజిస్ట్రార్ సారథి వ్యవహరిస్తున్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల విజేత ఎస్వీయూ కాలేజి



సాఫ్ట్‌బాల్ విజేత ఎస్వీయూ జట్టు

తిరుపతి (క్రీడలు), అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ మైదానంలో గురువారం నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఎస్వీయూ కాలేజీ జట్టు విజయం సాధించింది. తుదిపోరులో ఎస్వీయూ కాలేజీ, పీవీకేఎన్ చిత్తూరు డిగ్రీ కాలేజీ జట్లు తలపడ్డాయి. ఎస్వీయూ కాలేజీ జట్టు విజయం సాధించింది. ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి విజేత జట్టుకు ట్రోఫీ, మెడల్ అందించారు.

ఏం జరుగుతోంది?

● రెండు రోజులుగా డ్యూయాంగన్‌ను విచారిస్తున్న ఈడీ అధికారులు

● కీలక రికార్డుల స్వాధీనం



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఒప్పంద కాంట్రాక్టరుగా ఓ పరిశ్రమలో పనిచేసేందుకు చైనా నుంచి డ్యూయాంగన్ వచ్చాడు. వీసా గడువు ముగిసినా వెళ్లలేదు. బెయిల్‌పై బయట ఉంటూ అనేక వ్యాపారాలు చేస్తున్నాడు. ఇతడి ఆర్థిక లావాదేవీలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైదరాబాదు ఎన్‌ఫోర్సుమెంటు అసిస్టెంట్ కమిషనర్ అభిషేక్ నేతృత్వంలో పది మంది అధికారులు బుధవారం ఉదయం రేణిగుంట మండలం గురవరాజుపల్లెలోని అతడి ఇంట్లో సోదాలు మొదలు పెట్టారు. అప్పట్నుంచి డ్యూయాంగన్‌ను అదుపులోకి తీసుకుని గురువారం కూడా సోదాలు, విచారణ కొనసాగించారు. బిగ్ కిచెన్ పేరుతో చైనా కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇతడు ఆహారం సరఫరా చేస్తున్నాడు. వివిధ చైనా కంపెనీల నుంచి స్క్రాబ్ కొని వ్యాపారం చేస్తున్నాడు. కొంతమంది చైనీయులు, స్నేహితుల పేరిట వ్యాపారాలు చేస్తున్నట్లు సమాచారం. మూడేళ్ళుగా వీసా గడువు ముగిసినా ఇక్కడే ఉండటం, పన్నులు చెల్లించకుండా, వివిధ కంపెనీల పేరుతో వ్యాపారాలు నిర్వహించడం, హవాలా రూపంలో డబ్బు దేశం దాటిస్తున్నాడంటూ వచ్చిన ఫిర్యాదులపై ఈడీ సోదాలు జరుగుతున్నట్లు సమాచారం. కాగా, గురువారం ఏర్పేడు మండలం వికృతమాలలో ఇతడి స్క్రాబ్ గోడౌన్లలోనూ ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. అక్కడ రికార్డులు, కొన్ని రసీదులు, బిల్లు పుస్తకాలు, రవాణా.. వే బిల్లులు స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇక, డ్యూయాంగన్‌కు అకౌంట్లున్న బ్యాంకులకు సంబంధించి కొందరు అధికారులను పిలిపించి విచారించినట్లు తెలిసింది. అతడి బ్యాంకు పాసుపుస్తకాలు, చెక్‌లు, మొబైల్ ఫోన్లు సీజ్ చేశారు. బ్యాంకు అకౌంట్లు హోల్డ్‌లో పెట్టారు. కాగా, బ్యాంకు లావాదేవీలపై శుక్రవారం తనిఖీలు చేస్తారని సమాచారం.

కేవీ పల్లెలో దారుణం

● చెల్లెలిపై అన్న అఘాయిత్యం

● మగబిడ్డకు జన్మనిచ్చిన బాలిక



పీలేరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నానాటికీ అంతరించిపోతున్న నైతిక విలువలకు అద్దం పట్టే సంఘటన గురువారం పీలేరు నియోజకవర్గం కేవీపల్లె మండలంలో వెలుగు చూసింది. సోదరి బాగోగులు చూసుకోవాల్సిన సోదరుడు కామంతో కళ్లు మూసుకుపోయి ఆమెపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఫలితంగా ఆ బాలిక గర్భం దాల్చడమే కాకుండా మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయం బయటకు తెలిస్తే పరువుపోతుందన్న భయంతో పుట్టిన బిడ్డను వదిలించుకోవాలని బంధువులు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టి ఈ విషయం బయటకు పొక్కింది. కేవీ పల్లె మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (16) తండ్రికి పక్షవాతం సోకి కొన్నేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. కుటుంబ పోషణార్థం బాలిక తల్లి గల్ఫ్ దేశాలకు వెళ్లింది. ఈ నేపథ్యంలో ఇంటి వద్ద ఒంటరిగా ఉంటున్న ఆ బాలికపై ఆమె పెద్దనాన్న కుమారుడు కన్నేశాడు. కొంతకాలంగా ఆమెను లొంగదీసుకుని ఆమెపై అఘాయిత్యానికి పాల్పడుతున్నాడు. ఫలితంగా ఆ బాలిక గర్భం దాల్చింది. ఆమె శరీరంలో జరిగిన మార్పులను గమనించిన సమీప బంధువులు ఆమెను మూడు రోజుల క్రితం పీలేరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యురాలి వద్దకు తీసుకెళ్లడంతో బాలిక గర్భంతో ఉన్న విషయం తెలిసింది. బాలికను గట్టిగా అడగడంతో తనపై జరిగిన అఘాయిత్యాన్ని వారికి వివరించింది. ఇక చేసేది లేక వారు ఆ విషయాన్ని గ్రామంలోని పెద్ద మనుషులకు తెలియజేశారు. అదే సమయంలో బాలికకు కాన్పు చేయాలని వైద్యురాలిని అభ్యర్థించడంతో ఆమె ఆ బాలికను తన ఆసుపత్రిలో జాయిన్ చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న ఆ బాలిక సోదరుడు గ్రామం నుంచి ఉడాయించాడు. అతని తరపు వారు ఆసుపత్రికి చేరుకుని బాలిక వద్ద ఉన్న వారితో మంతనాలు ప్రారంభించారు. పుట్టిన బిడ్డను పీలేరులోనే వదిలించుకోవాలని,బాలిక ఆలనా పాలనా తాము చూసుకుంటామని నమ్మబలికారు. అందరూ సమ్మతించి ప్రసవం అయిన తరువాత గ్రామంలోని కులపెద్దల సమక్షంలో పంచాయితీ చేసుకోవచ్చునని తీర్మానించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ బాలిక బుధవారం రాత్రి మగబిడ్డకు జన్మనిచ్చింది. సాధారణ ప్రసవం కావడం, పీలేరులో ఉంటే ఇబ్బందులు ఎదురవుతాయన్న ఆలోచనతో బిడ్డతో పాటు బాలికను గురువారం ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసుకుని వెళ్లిపోయారు. వెళ్లిపోయే సమయంలో పుట్టిన బిడ్డను ఎవరికైనా ఇచ్చేయాలని కొంతమందితో సంప్రదింపులు చేస్తుండడంతో ఈ విషయం బయటకు పొక్కింది. దీంతో వారు అక్కడి నుంచి స్వగ్రామానికి వెళ్లిపోయారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అందరూ ఉలిక్కిపడ్డారు. అటు పోలీసులకు, ఇటు ఐసీడీఎస్ అధికారులకు సైతం సమాచారం లేకపోవడం కొసమెరుపు. ఇటువంటి సంఘటనల్లో కాసింత ముందుగా స్పందించాల్సిన ఐసీడీఎస్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తూ కూర్చోవడం విశేషం. తీరా గురువారం సాయంత్రం స్పందించిన ఐసీడీఎస్ అధికారులు బసన్నగారిపల్లెలోని బాలిక స్వగృహం, పీలేరులోని ప్రైవేటు ఆసుపత్రిలో విచారణ చేపట్టి కాన్పు జరిగిన విషయం నిజమేనని నిర్ధారించారు. బాలికకు కాన్పు చేసిన ప్రైవేటు ఆసుపత్రిపై పీలేరులోని పలు ప్రజాసంఘాలు మండిపడ్డాయి. మైనర్ బాలిక కాన్పు కోసం వచ్చినప్పుడు పోలీసులు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇవ్వకుండా దాచిపెట్టడం, కాన్పు అయిన తరువాత కూడా కనీస సమాచారం ఇవ్వకపోవడంపై వారు ధ్వజమెత్తారు. అంతేకాకుండా బిడ్డను ఇతరులకు అప్పగించేలా ఆసుపత్రి నిర్వాహకులు మంతనాలు సాగించారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ, డీబీఎస్ఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బద్దె భానుప్రకాశ్ ఆరోపించారు. బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన యువకుడిపై కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కుప్పంలో దోమల నివారణకు చర్యలు



దోమల నివారణ ద్రావణం పిచికారీ చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

కుప్పం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘ పరిధిలో దోమల నివారణకు మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు చర్యలు తీసుకుంటున్నారు. పురపాలక సంఘం పరిధిలోని దాదాపు అన్ని పెద్ద, చిన్న మురుగు కాలువల్లో పూడిక తీయించారు. ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయిస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది ప్రతి వీధీ తిరుగుతూ మెలాథిన్ ఆయిల్ స్ర్పే చేస్తున్నారు. కాలువలపై ఉన్న బండలను తొలగించి మరీ పూడిక తీయడంతో కాలువలు పరిశుభ్రంగా కనిపించడమే కాకుండా మురుగు యథేచ్ఛగా నిల్వ లేకుండా ప్రవహిస్తోంది. దీంతో దోమల లార్వాలు నిల్వ ఉండటానికి అవకాశం లేకుండా పోతోంది. దీనికి తగ్గట్టు ఎప్పటికప్పుడు మెలాథిన్ ఆయిల్ పిచికారీ చేస్తుండటంతో దోమలు వ్యాప్తి చెందకుండా నియంత్రించడం సాధ్యమవుతోంది.

కడా పీడీకి సత్కారం



కడా పీడీని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రాంతీయ అభివృద్ధి సంస్థ (కడా) కార్యాలయం రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛాంధ్ర అవార్డును సొంతం చేసుకుంది. అమరావతిలో ఈనెల 6వ తేదీన జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా కడా పీడీ వికాస్ మర్మత్ అవార్డు స్వీకరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కడా పీడీని గురువారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సత్కరించారు. కడా కార్యాలయంలో ఆయన పీడీ వికాస్ మర్మత్‌ను కలిసి శాలువ కప్పి సన్మానించి అభినందించారు. ఇలాగే కడా అభివృద్ధికి మరింతగా కృషి చేసి ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కుప్పాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని ఎమ్మెల్సీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాకీర్, నాయకులు ఫైరోజ్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబాలకు అండగా పొదుపు రుణాలు



మాట్లాడుతున్న శివశంకర్

సోమల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘంలో ఖాతాదారులు పొదుపు ఖాతాలు ప్రారంభించి రుణాలు పొంది కుటుంబాలకు అండగా నిలవాలని సింగిల్ విండో చైర్మన్ శివశంకర్ తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఖాతాదారుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సహకార సంఘ సంస్థలో రైతులకు విరివిగా రుణ సౌకర్యం కల్పిస్తుందని, చిన్నపాటి దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారంతో అభివృద్ధి చెందాలన్నారు. బంగారు నగలపై తక్కువ వడ్డీతో రుణ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో సీఈవో రెడ్డెప్ప, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణంనాయుడు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, సభ్యులు సతీశ్, అష్రఫ్ అలీ, మహేంద్ర బాబు, చాణుక్య, మణియాదవ్, ఈశ్వర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో బంగారు తిరుత్తణి కొండచుట్టు పనులు



చేపడుతున్న కొండచుట్టు పనులు

సోమల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని బంగారు తిరుత్తణి కొండచుట్టు భక్తులు గిరిప్రదక్షిణకు ఇబ్బందులు పడుతుండటంతో పలువురు దాతలు కాలినడక మార్గంలో ఎక్స్‌కవేటర్లతో పనులు ముమ్మరం చేశారు. గత మూడు రోజులుగా పనులను శివాలయం భజన మండలి సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకొన్నారు. ప్రతి పౌర్ణమికి కొండ చుట్టు కార్యక్రమం నిర్వహించడానికి భక్తులకు సౌకర్యంగా చర్యలు చేపట్టారు. శనివారం కొండ చుట్టు గిరి ప్రదక్షిణకు భక్తులు ఏర్పాటు చేపట్టారు. మాజీ సర్పంచి శ్రీరాములు, కృష్ణదేవరాయ కమిటీ అధ్యక్షుడు మునివెంకటప్ప పనులను పర్యవేక్షించారు.

రైతుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం



రైతుకు రుణాన్ని అందిస్తున్న సింగిల్‌విండో చైర్మన్ హరిప్రసాద్

చౌడేపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని సింగిల్ విండో చైర్మన్ పగడాల హరిప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక సింగిల్ విండో కార్యాలయంలో క్రాప్‌లోన్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసమే అన్నదాత సుఖీభవ పథకంలో రూ.20 వేలకు పెంచారని, పాడిరైతుల అభివృద్ధి కోసం గోకులం షెడ్ల పథకం ప్రవేశ పెట్టారని, సహకార బ్యాంకు నుంచి తక్కువ వడ్డీకే రుణాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఈవో మునిరాజ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర కార్యక్రమాలు బహిష్కరిస్తున్నాం

● ఉపాధ్యాయ సంఘ నేతలు



ఎంఈవో శివరత్నకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

సోమల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బోధనేతర కార్యక్రమాలు బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో సంఘ నేతలు గురువారం ఎంఈవో శివరత్నకు వినతి పత్రం అందజేశారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఉపాధ్యాయ సంఘ నేతలు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు హాజరు వేయడం, పరీక్షల మార్కులు అప్లోడ్ చేయడం, మధ్యాహ్న భోజన వివరాలు అప్లోడ్ చేయడం తప్ప వేరే బోధనేతర కార్యక్రమాలు గూగుల్ పత్రాలు అప్లోడ్ చేయడం, విద్యాశక్తి కార్యక్రమాలు, జీఎస్టీ అవగాహన కార్యక్రమాలు తదితర వాటిని 10 వ తేదీ నుంచి బహిష్కరిస్తున్నామని తెలిపారు. నేతలు జీసీకే. ప్రసాద్, ఎస్వీ రమణ, రమణయ్య, భాస్కర్, ఇమ్రాన్, చెన్నకేశవులు, హరీశ్, శ్రీనివాసులు తెలిపారు.

టపాకాయల స్వాధీనం

సోమల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో పలుచోట్ల అక్రమంగా నిల్వ చేసిన టపాకాయలు సీజ్ చేసినట్లు తహసీల్దార్ మధుసూదన్, ఎస్ఐ శివశంకర తెలిపారు. గత ఏడాది దీపావళి నుంచి అక్రమంగా నిల్వ చేసిన టపాకాయలను స్వాధీనం చేసుకున్నారు.

న్యాయమూర్తిపై దాడికి యత్నం దుర్మార్గం

చౌడేపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు న్యాయమూర్తిపై దాడికి ప్రయత్నించడం దుర్మార్గమని స్థానిక కేవీపీసీ నాయకులు పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్, బీజేపీ అండతోనే దాడులను పాల్పడుతున్నారని ఆరోపించారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డీటీ రామ్మూర్తికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కేవీపీసీ నాయకులు వాసు, శేఖర్, బ్యాంకు రెడ్డెప్ప, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహుడికి విశేష పూజలు



విశేషాలంకరణలో లక్ష్మీ నరసింహుడు

కల్లూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, హోమం, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకృతుడైన స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అర్చకులు అనంతకుమారాచార్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉభయదారులుగా దేవళంపేటకు చెందిన టీడీపీ నాయకుడు మురళీ కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

నేడు కడా కార్యాలయంలో ఎలక్ట్రానిక్ వస్తువుల మేళా

కుప్పం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రాంతీయ అభివృద్ధి సంస్థ (కడా) కార్యాలయం ఆవరణలో శుక్రవారం 10 గంటలకు ఎలక్ట్రానిక్ వస్తువుల మేళా జరుగుతుందని కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్ తెలిపారు. వాషింగ్ మెషీన్లు, టీవీలు, ఏసీలు, ఫ్రిజ్‌లు, వాటర్ ప్యూరిఫైర్‌లు, మైక్రో ఓవెన్లు తదితర అన్ని రకాల ఎలక్ట్రానిక్ వస్తువులు ఈ మేళాలో తగ్గిన జీఎస్టీ ధరలకే లభిస్తాయన్నారు. రెండు రోజులపాటు ఈ మేళాను కుప్పం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు రాష్ట్రీయ పోషణ మాసంపై సమావేశం

కుప్పం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని బాబునగర్ కేవీఆర్ ఫంక్షన్ హాలులో శుక్రవారం ఉదయం 10 గంటలకు రాష్ట్రీయ పోషణ మాసం అనే అంశంపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో కృష్ణవేణి తెలిపారు. సెప్టెంబరు 17 నుంచి ఈనెల 16వ తేదీ వరకు జరుగుతున్న 8వ రాష్ట్రీయ పోషణ మాసానికి సంబంధించి తల్లీబిడ్డల ఆరోగ్యంపై ఈ సమావేశంలో చర్చ జరుగుతుందని, అవగాహన కల్పిస్తారని చెప్పారు.

ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు

పుంగనూరు రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పంచాయతీరాజ్ అతిథిగృహంలో జరిగిన వివిధ ప్రజాసంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు కంపెనీలు స్థానికులకు 75 శాతం ఉద్యోగ అవకాశాలు తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉందన్నారు. నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు శ్మశానాలకు స్థలాలు కేటాయించాలని కోరారు. ఆస్పత్రుల్లో అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నా నియంత్రించాల్సిన అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారాయుడు, నాయకులు నరసింహులు, అయూబ్‌ఖాన్, కృపాకర్, మునీంద్రనాయక్, శ్రీరాములు నాయక్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



పలమనేరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పలమనేరుకు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు తీసుకు రావడంతో పాటు స్వచ్ఛాంధ్ర రాష్ట్ర అవార్డు అందుకొన్న పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎస్వీ రమణారెడ్డిని గురువారం పలమనేరు పరిరక్షణ సమితి శాలువతో సన్మానించింది. పలమనేరు అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలకు పరిరక్షణ సమితి సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీపీఎస్ అధ్యక్షులు నరసింహులు, కార్యదర్శి నారాయణ, సభ్యులు శ్రీపురం సీతారామయ్య, విజయ్ కుమార్, మురళి, వెంకటేశ్వర్లు, దొరస్వామినాయుడు పాల్గొన్నారు.

దుస్థితిలో గ్రామీణ రహదారులు

● అడుగడుగునా వి.కోటకు వెళ్లే మార్గంలో గుంతలు

● తరచూ ప్రమాదాలతో ప్రయాణికుల అవస్థలు



గుంతలమయమైన జోగిండ్లు-అన్నవరం క్రాస్ రహదారి



గుంతలు తేలిన పల్లికుప్పం-రెక్కమాను రహదారి

రామకుప్పం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం నుంచి వి.కోట పట్టణానికి వెళ్లే పలు గ్రామీణ రహదారులు దుస్థితికి చేరడంతో మండల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మండల పరిధి పల్లికుప్పం నుంచి వి.కోట-పేర్నాంబట్టు రోడ్డును కలిపే రెక్కమాను వరకు ఉన్న బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. మండల పరిధి బందార్లపల్లె, గొరివిమాకులపల్లె, పంద్యాలమడుగు, పీఎంకేతండా పంచాయతీల పరిధిలోని ప్రజలతోపాటు వి.కోట మండలంలోని ఎస్.బండపల్లె పంచాయతీ ప్రజలు నిత్యం పలు పనుల నిమిత్తం ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే తమిళనాడు రాష్ట్రం పేర్నంబట్టు, గుడియాత్తం, వేలూరు, ఆంబూరు పట్టణాలకు ఇదే రహదారిలో ప్రయాణాలు చేస్తుంటారు. అలాగే రామకుప్పం పట్టణం నుంచి పాతూరు, అన్నవరం క్రాస్‌ల మీదుగా వి.కోటకు వెళ్లే రహదారులు రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. టీడీపీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రామకుప్పం నుంచి వి.కోట మండలం పాతూరు వరకు బీటీ రోడ్డును పునర్నిర్మించారు.

అయితే అక్కడి నుంచి వి.కోట-పేర్నాంబట్టు రోడ్డు వరకు రోడ్డు పనులు జరగలేదు. పాతూరు నుంచి వి.కోట-పేర్నాంబట్టు రోడ్డు వరకు రహదారి పలుచోట్ల గతుకులమయంగా మారింది. మరోవైపు రామకుప్పం మండలం జోగిండ్లు నుంచి అన్నవరంక్రాస్ వరకు గల రహదారి పలుచోట్ల గుంతలమయంగా మారింది. రామకుప్పం, వి.కోట మండలాల ప్రజలు ఈ మార్గంలో రోజూ రాకపోకలు సాగిస్తుంటారు. రహదారులపై లోతు గుంతలేర్పడటంతో రాకపోకల్లో వాహన చోదకులు అసౌకర్యానికిగురవుతున్నారు. రహదారుల పునర్నిర్మాణం ఆలస్యమైతే సత్వరం గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిఒక్కరికీ జీఎస్టీపై అవగాహన తప్పనిసరి



పలమనేరు : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న నాగరాజు



బైరెడ్డిపల్లె: జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

పలమనేరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ జీఎస్‌టీపై అవగాహన కలిగి ఉండాలని పలమనేరు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగరాజు సూచించారు. గురువారం పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో జీఎస్‌టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణి, బ్యాంకు అధికారులు, బీమా కంపెనీల ప్రతినిధులు, వైద్యులు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సుధాకర్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, చంద్రకళ పాల్గొన్నారు. ● **బైరెడ్డిపల్లె:** ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో కలుగుతున్న ప్రయోజనాలపై గురువారం మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యసిబ్బంది గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, పీహెచ్ఎన్ శమంతక, సూపర్‌వైజర్ తిరుమలమ్మ, హెల్త్‌అసిస్టెంట్ రాజారెడ్డి, నాయకులు గోవిందస్వామి, రమేష్, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● **సదుం:** సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అమలుతో సాధారణ రోగాలకు అవసరమైన ఔషధాల ధరలు తగ్గినట్లు ఎంపీడీవో రాధారాణి తెలిపారు. జీఎస్టీ తగ్గింపుపై స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రసాదరాజు, వైద్యులు పుష్పకుమారి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పులిచెర్లలో భారీ వర్షం

కల్లూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఉదయంతోనే ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. వాతావరణంలో మార్పు చోటుచేసుకొని చిరుజల్లులతో వర్షం ప్రారంభమైంది. కొంత సేపటికి చిరుజల్లులు కాస్త భారీ వర్షంగా మారింది. వర్షంతో పనులకు వెళ్లే కూలీలు, ఉద్యోగులు, రైతులు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో మండలంలోని కుంటలు, చెరువులు వర్షపు నీటితో జలకళలాడుతున్నాయి. ఇప్పటి వరకు కురిసిన వర్షాలతోనే రెండేళ్ల వరకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు. వ్యవసాయానికి అనుకూలంగా వర్షాలు పడుతున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వి.కోట: వి.కోటలో గత రెండు రోజులుగా వర్షం దంచి కొట్టేస్తోంది. పగలు, రాత్రి తేడా లేకుండా వాన కురుస్తుండటంతో పట్టణంలో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. గురువారం సాయంత్రం గంట పాటు కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా వాననీటితో నిండి పోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎగువ చెక్‌పోస్టు, మధ్య బస్టాండు, భారత్‌నగర్ ప్రాంతాల్లో వర్షపునీటితో ప్రజల రాకపోకలకు అవస్థలు పడ్డారు. గత నెల రోజులుగా మండలంలో కురుస్తున్న వరుస వానలకు చెరువులకు జలకళ సంతరించుకుంటోంది.

మహిళ అదృశ్యం

పుంగనూరు రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పుంగనూరు పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ జనార్దన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పుంగనూరు మండలం నెక్కుంది గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం భార్య రాధమ్మ (41) మంగళవారం ఉదయం నుంచి కనిపించలేదని, పొలాల్లో, బంధువుల వద్ద విచారించినా ఫలితం లేదని భర్త ఫిర్యాదులో పేర్కొన్నారు. భర్త సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శిక్షణ ఎస్ఐగా మణికంఠేశ్వరరెడ్డి



చౌడేపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): శిక్షణ ఎస్ఐగా మణికంఠేశ్వరరెడ్డి గురువారం చౌడేపల్లెలో బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రానికి చెందిన మణికంఠేశ్వరరెడ్డి 2024 బ్యాచ్ ఎస్ఐగా ఎంపికయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో నెల రోజుల పాటు శిక్షణ ఎస్ఐగా పని చేయనున్నట్లు సీఐ రాంభూపాల్ తెలిపారు.

ఐటీఐ, సింగిరిగుంట సచివాలయాల్లో చోరీ

పుంగనూరు రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు సమీపంలోని ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ, సింగిరిగుంట సచివాలయాల్లో బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు పంచాయతీ కార్యదర్శి సుధారాణి, ఐటీఐ ఏవో ఇందిరావతమ్మ వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేశారు.

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని కలిసిన చౌడేపల్లె నాయకులు



చౌడేపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుకర్‌ను చౌడేపల్లె బీజేపీ మండలాధ్యక్షులు కడియాల మనోహర్ గురువారం చిత్తూరులో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన్ను శాలువతో సన్మానించారు.

అథ్లెటిక్స్‌లో పుంగనూరు విద్యార్థుల ప్రతిభ



పుంగనూరు రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): డివిజన్ స్కూల్ గేమ్స్‌లో భాగంగా సదుంలో గురువారం నిర్వహించిన షాట్‌పుట్, డిస్కస్ త్రో క్రీడాపోటీల్లో పుంగనూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు చంద్రమాకులపల్లె హైస్కూల్ పీడీ మురళీధర్ తెలిపారు. సదుంలో జరిగిన డివిజన్ స్థాయి అథ్లెటిక్స్‌లో చంద్రమాకులపల్లె ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న గానవి షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం, జోష్న ద్వితీయ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. దీంతో విద్యార్థులను పలువురు అభినందించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



బైరెడ్డిపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, మహతి ఫౌండేషన్ ప్రతినిధులు శాంతమ్మ, బుజ్జి, శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి



ద్వారకనాథరెడ్డిని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ తదితరులు

పలమనేరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర బార్‌కౌన్సిల్ అధ్యక్షులు నల్లారి ద్వారకనాథరెడ్డికి గురువారం పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్, న్యాయవాదులు వినతిపత్రం అందజేశారు. గురువారం నల్లారి ద్వారకనాథరెడ్డి పలమనేరు బార్ అసోసియేషన్‌ను సందర్శించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, షరీఫ్, జాయింట్ సెక్రటరీ ఫామిద్‌బాషా, స్పోర్ట్సు కార్యదర్శి రంజిత్‌షా, న్యాయవాదులు పి.పరమశివప్ప, కె.లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులను పట్టించుకోరా?

● వి.కోట మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం



మండల సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీపీ యువరాజ్

వి.కోట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధుల మాటలను గ్రామ కార్యదర్శులు పట్టించుకోవడం లేదని, పంచాయతీల్లో సర్పంచులు చేసిన పనులకు బిల్లులు పెట్టకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ వి.కోట మండల సమావేశంలో సభ్యులు అధికారులను ప్రశ్నించారు. గురువారం ఎంపీపీ యువరాజ్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన ప్రారంభమైన మండల సమావేశంలో పంచాయతీల్లో సర్పంచులు చేసిన పనులకు బిల్లులు ఎందుకు చెల్లించడం లేదంటూ కార్యదర్శులను ఎంపీపీ నిలదీశారు. ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులు జమచేస్తే చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సభలో అధికారులను ప్రశ్నించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో తహసీల్దార్ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. 72 గంటల్లోపు బిల్లులు చెల్లించాలని డిమాండు చేస్తూ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు జడ్పీ చైర్మన్, ఎంపీపీలు ప్రకటించడంతో సభ్యులు, సర్పంచులు సమావేశం నుంచి నిష్క్రమించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తమీంఖాన్, లక్ష్మణ్‌రెడ్డి, ఎంపీడీవో రామచంద్రన్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే


సదాశివరెడ్డి కుటుంబీకులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ వైస్ ఎంపీపీ సదాశివరెడ్డి అనారోగ్య కారణంగా 2021లో మృతి చెందాడు. అప్పట్లో ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే భానుప్రకాష్.. సీఎం చంద్రబాబుతో మాట్లాడి రూ.8లక్షల సీఎం సహాయనిధి మంజూరు చేయించి.. సంబంధిత చెక్కును గురువారం సదాశివరెడ్డి కుటుంబీకులకు అందజేశారు. గాయపడ్డ రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి కుమార్తెను కృష్ణాపురంలో పరామర్శించారు. రామానాయుడు కాలనీలో తమిళబాయ్ మృతి చెందడంతో వారి కుటుంబీకులను ఓదార్చారు. నగరి పీఏసీఎస్ అధ్యక్షుడు బాలాజి, నగరి మండల టీడీపీ అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా టపాసులు నిల్వ చేస్తే చర్యలు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడి ఆదేశాలతో ఒకటి, రెండో పట్టణ పోలీసు స్టేషన్ల పరిధిలో బాణసంచా గోదాములు, దుకాణాలపై గురువారం పోలీసులు, రెవెన్యూ సిబ్బంది దాడులు నిర్వహించారు. కొంగారెడ్డిపల్లె, పాత ఎంప్లాయిమెంట్ రోడ్డు, పొన్నియమ్మన్‌గుడి వీధి, దొడ్డిపల్లె, కట్టమంచిలోని దుకాణాలు, గోదాముల్లో స్టాకును పరిశీలించారు. ఒకటో పట్టణ సీఐ మహేశ్వర మాట్లాడుతూ.. అనుమతుల్లేకుండా టపాసులను నిల్వ ఉంచితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వరసిద్ధుడికి కానుకగా ఎలక్ట్రికల్ బైక్



ఐరాల(కాణిపాకం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అరగొండకు చెందిన శ్రీవెంకటేశ్వర ఈవీ బైక్స్ ప్రకాష్ ఎలక్ట్రికల్ బైక్‌ను గురువారం ఈవో పెంచలకిషోర్‌కు అందించారు. విజయవాడకు చెందిన తెలుగు అర్ఫ్ సాయి అన్నదాన కార్యక్రమానికి రూ.80,000, గోసంరక్షణ ట్రస్టుకు రూ.1,00,000 విరాళంగా అందించారు. దాతలకు ఆలయాధికారులు స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాంబ ఆలయ హుండీ ఆదాయం రూ.4.8లక్షలు

చిత్తూరు సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబ ఆలయ హుండీ ఆదాయం రూ.4.8లక్షలు వచ్చిందని ఈవో తిమ్మారెడ్డి తెలిపారు. ఆగస్టు రెండో తేదీ నుంచి గురువారం వరకు భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించడం జరిగిందన్నారు. దేవదాయశాఖ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రాధిక, పాలక మండలి చైర్మన్ దిలీప్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

నగరి ఏఎంసీ వైస్ చైర్మన్‌కు సన్మానం



నగరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరి ఏఎంసీ వైస్ చైర్మన్‌గా నియమితులైన రామ్మూర్తి నాయుడిని నగరిలో గురువారం సన్మానించారు. నగరి పీఏసీఎస్ అధ్యక్షుడు బాలాజి, టీడీపీ మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కుమార్ నాయుడు, మాజీ ఎంపీటీసీ హరిబాబు, భూపతిరెడ్డి, బాలు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక రాష్ట్ర మంత్రి

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మంత్రి మునియప్ప గురువారం రాత్రి కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, కాణిపాకం ఎస్ఐ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి అమానుషం

పూతలపట్టు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సీజేఐపై దాడి అమానుషమని రాష్ట్ర న్యాయవాదుల సంఘం పేర్కొంది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు కె.గోపినాథ్ రెడ్డి ప్రధాన కార్యదర్శి రామగోపాల్ రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ అశోక్ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి మాదిరెడ్డి రాము, వర్కింగ్ ప్రెసిడెంట్ జనార్దన్ రావు, హానరి ప్రెసిడెంట్ ఆనందరావు, సెక్రటరీ నరేష్, చీఫ్ అడ్వైజర్ సుబ్బారెడ్డి, ట్రెజరర్ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ శివకుమార్, సుధాకర్, జాయింట్ సెక్రటరీ రమణరావు తదితరులు ఒక ప్రకటనలో ఖండించారు. ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని కోరారు.

పశువుల్లో గర్భకోశ వ్యాధులకు చికిత్స


మినరల్ మిక్చర్ ప్యాకెట్లతో రూపసుందరి తదితరులు

వెదురుకుప్పం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో గర్భకోశ వ్యాధులకు చికిత్స అందిస్తున్నామని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెదురుకుప్పం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ రూపసుందరి తెలిపారు. గురువారం సంతబైలులో ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పాడి పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. డాక్టర్ యశోద, పుత్తూరు డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ గోవిందయ్య, మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్, ఉద్యోగులు గణేష్, రామదాస్, కావేరి పాల్గొన్నారు.

బాధితులకు భానుప్రకాష్ పరామర్శ

విజయపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహారాజపురంలో అనారోగ్యం నుంచి కోలుకుంటున్న మాజీ సర్పంచ్ వెంకటేశులును, మల్లారెడ్డికండ్రిగలో టీడీపీ కార్యకర్త నాదమునిని నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ గురువారం పరామర్శించారు. కోసలనగరంలో టీడీపీ నాయకుడు హరికృష్ణ తండ్రి చెంగల్‌రాజు మృతి చెందడంతో ఆయన మృతదేహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఎమ్మెల్యే వెంట నగరి ఏఎంసీ చైర్‌పర్సన్ రాజమ్మ, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, చిత్తూరు పార్లమెంటు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, నాయకులు సుధాకర్‌రాజు, కొండూరు దాము, సోమశేఖర్ తదితరులున్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

శ్రీరంగరాజపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. ఎస్ఆర్‌పురం మండలానికి చెందిన 17 ఏళ్ల బాలికను చిత్తూరు కట్టమంచికి చెందిన మోహన్ కొడుకు ఉమేష్ (24) ప్రేమ పేరుతో మోసం చేశాడని బాధితులు ఫిర్యాదు చేశారు. దాంతో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

'అర్ధగిరి' హుండీ ఆదాయం రూ.17.35 లక్షలు

తవణంపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు జరిగింది. 122 రోజులకు రూ.17,35,350, 3.6 గ్రాముల బంగారు, 102 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ ఈవో మునిశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్వేత, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల పరిశీలన

గుడిపాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏఎల్‌పురం, పాపసముద్రం, చిత్తపార, గుడిపాలలో పంటలను వ్యవసాయ ఏడీ ఉమ గురువారం పరిశీలించారు. ఈ-క్రాప్ నమోదుపై అవగాహన కల్పించారు. ఏవో సంగీత, తహసీల్దార్ శ్రీనివాస్, వీఆర్వోలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.


ఆత్మకూరు - నరసింగరాయనిపేట మధ్య నీవానదిలో తెగిపోయిన మట్టి రోడ్డు


కలిజవేడు - కొట్రకోన మధ్య నీవానదిలో తెగిపోయిన మట్టి రోడ్డు

వర్షాలొస్తే 8 పంచాయతీలకు కష్టాలే..!

నీవానదిలో తెగిపోతున్న మట్టి రోడ్లు

లో లెవల్ బ్రిడ్జిల నిర్మాణంతోనే సమస్యకు పరిష్కారమంటున్న జనం

గంగాధరనెల్లూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురిసి నీవానదిలో ప్రవాహం సాగిందంటే గంగాధరనెల్లూరు మండలంలోని ఎనిమిది పంచాయతీలకు చెందిన ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. కలిజవేడు-కొట్రకోన మధ్య నీవానదిలోని మట్టి రోడ్డు కొట్టుకుపోవడంతో దీనివల్ల కలిజవేడు, నందనూరు, పాపిరెడ్డిపల్లె పంచాయతీలకు చెందినవారు ఇబ్బంది పడుతున్నారు. ఆత్మకూరు-నరసింగరాయనిపేట మధ్య కూడా నీవానదిలోని మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. దాంతో ఆత్మకూరు, కడపగుంట, ఎల్లాపల్లె, అంబోధరపల్లె, తిరువీధికుప్పం పంచాయతీలవారు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ రెండు ప్రాంతాల్లో లోలెవల్ బ్రిడ్జిలు నిర్మిస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు వస్తున్నారు.. పోతున్నారు.. ఏళ్లు గడిచిపోతున్నాయి కానీ బ్రిడ్జిల నిర్మాణం మాత్రం మొదలు కావడం లేదని జీడీనెల్లూరు సింగిల్‌విండో చైర్మన్ ముప్పిరి మోహన్‌నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు బి.స్వామిదాస్, కడపగుంట టీడీపీ పోలింగ్ బూత్ కన్వీనర్ సి.ఆర్ముగం తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు


గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్న రోఖియా బేగం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రోఖియా బేగం వెల్లడించారు. గురువారం కొంగారెడ్డిపల్లెలోని సీడీపీవో కార్యాలయం వద్ద పోషణ్ మేళా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, బాలింతలను దృష్టిలో పెట్టుకుని స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించనున్నారని చెప్పారు. ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి మాట్లాడుతూ.. గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా అనీమియా వ్యాధుల బారి నుంచి తప్పించుకోవచ్చన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నపిల్లలకు అన్నప్రాసనతోపాటు పోషకాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. సీడీపీవో సుగుణకుమారి, డీసీపీవో సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్లు, వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఎస్టీపీకి స్థల పరిశీలన


మామిడికాయల మండీ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఏర్పాటు చేయనున్న సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)కు అవసరమైన స్థలం కోసం గురువారం కట్టమంచి మామిడి కాయల మండీ ప్రాంతంలో నగరపాలక అధికారులు పరిశీలించారు. కమిషనర్ నరసింహ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పుష్పగిరి నాయక్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఎంహెచ్‌వో లోకేష్ లు కలిసి ఎస్టీపీకి అవసరమైన స్థలాన్వేషణ చేశారు. సుమారు రూ.34 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధులతో ఎస్టీపీ నిర్మాణం, ప్రాజెక్టు రోడ్డు మ్యాప్, భవిష్యత్తు నిర్వహణపై చర్చించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రజలకు రసాయనాలకు లోనుకాని నీటిని అందించగలుతామని తెలిపారు.

డ్రామాలెందుకు జగన్?: తెలుగు యువత

గుడిపాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): హైకోర్టే పీపీపీ విధానాన్ని సమర్థించి టెండర్ల ఖరారుపై స్టే ఇచ్చేందుకు నిరాకరించాక ఇంకా డ్రామాలెందుకు జగన్ అని మాజీ సీఎంను టీడీపీ తెలుగు యువత అధికార రాష్ట్ర ప్రతినిధి గోళ్లహేమాద్రినాయుడు ప్రశ్నించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైద్యకళాశాలలను పీపీపీ విధానంలో నిర్మించడానికి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వైసీపీని రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. ఇకనైనా బురద చల్లే కార్యక్రమాలు ఆపాలని హితవు పలికారు.

'థామస్‌ని విమర్శిస్తే తాట తీస్తాం'

వెదురుకుప్పం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్‌ని విమర్శిస్తే తాట తీస్తామని కార్వేటినగరం మండల తెలుగు యువత అధ్యక్షుడు తోటి మురళీమోహన్ హెచ్చరించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఆర్‌పురంలో చోటా వైసీపీ నాయకులకు థామస్‌ను విమర్శించే అర్హత లేదన్నారు.

స్వామీ.. రాజకీయ సమాధి ప్రాప్తించింది!

- మాల కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్

వెదురుకుప్పం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): 'స్వామీ.. తండ్రీకూతుళ్లకు రాజకీయ సమాధి ప్రాప్తించింది.. చింతించకు ఇంటికే పరిమితమైపో' అంటూ మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామికి ఏపీ మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ హితవు పలికారు. గురువారం కార్వేటినగరంలో మీడియాతో మాట్లాడారు. 'అంబేడ్కర్ విగ్రహాన్ని నీ స్వార్థం కోసం, నీ కూతురి ఉనికి కోసం వాడుకోవాలని చూసిన రోజే రాజకీయ సమాధి ప్రాప్తించింది గుర్తుంచుకో. ఎన్ని కుట్రలు చేసినా మా మంచి ప్రభుత్వానికి నీ పాపపు మరకలు అంటించలేవు' అని యుగంధర్ స్పష్టం చేశారు.

వైసీపీ ఖండన

గంగాధరనెల్లూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై ప్రభుత్వ విప్ థామస్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని వైసీపీ నేతలు ఖండించారు. గంగాధరనెల్లూరులో గురువారంమీడియాతోమాట్లాడారు. వెంకటరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, హరిబాబు, ఏకాంబరం, వెంకటేష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వేలుమొదలి, కేశవరెడ్డి, డిల్లీ, జగదీష్‌బాబు, శేఖర్ పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురంలో టపాసుల సీజ్



శ్రీరంగరాజపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురంలోని గోడౌన్లలో అనుమతుల్లేకుండా నిల్వ ఉన్న టపాసులను గురువారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ లోకనాథం పిళ్ళై తెలిపారు. మండలం కేంద్రంతో పాటు 49.కొత్తపల్లెమిట్ట, పిళ్లారికుప్పం క్రాస్, కోటర్లపల్లెలోని టపాసుల గోడౌన్లలో తనిఖీలు చేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 21మందికి జరిమానా



చిత్తూరు అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. రెండు, మూడ్రోజులుగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 21 మందిపై కేసు నమోదు చేశారు. వీరిని గురువారం కోర్టులో జడ్జి ముందు ప్రవేశపెట్టారు. ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధిస్తూ జడ్జి ఉమాదేవి ఆదేశాలు జారీ చేసినట్లు సీఐ తెలిపారు.

కాణిపాకం లాడ్జీలలో తనిఖీలు

ఐరాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలోని ప్రైవేటు లాడ్జీలను ఎస్ఐ నరసింహులు గురువారం తనిఖీ చేశారు. లాడ్జీకి వచ్చే ప్రతి ఒక్కరి వద్దా ఆధార్ కార్డును తీసుకోవాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

కాలువను ఢీకొన్న బైక్: ఇద్దరికి గాయాలు

పూతలపట్టు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కనున్న కాలువను బైక్‌తో ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి సమీపాన ఉన్న పెద్దగుట్టకు చెందిన జగదీష్, జయకృష్ణలు గురువారం కాణిపాకం వరసిద్ధుడిని దర్శించుకుని రాత్రి 7.30 గంటల సమయంలో స్వగ్రామానికి బైక్‌పై బయల్దేరారు. పూతలపట్టు మండలంలోని కిచ్చెన్నగారిపల్లె ఫ్లైఓవర్ సమీపాన ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కనున్న కాలువను ఢీకొట్టి కిందపడ్డారు. ఇద్దరూ గాయపడటంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహం నిర్వాహకురాలి అరెస్టు

గంగాధరనెల్లూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పెద్దకాల్వ పంచాయతీ చెర్లోపల్లెకు సమీపంలోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతున్న సమాచారంతో సీఐ శ్రీనివాసంతి తన సిబ్బందితో కలిసి గురువారం దాడి చేశారు. నిర్వాహకురాలితో పాటు ఇద్దరు మహిళలు, ఇద్దరు విటులను అరెస్ట్ చేశారు.

యువకుడి ఆత్మహత్య


జాన్ పీటర్ మృతదేహం

యాదమరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వరిగపల్లె దళితవాడకు చెందిన వి.జాన్‌పీటర్ (22) బుధవారం రాత్రి తన నివాసంలో సీలింగ్‌కు తాడుతో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులే కారణమని సమాచారం. గురువారం ఉదయం మృతుడి తల్లి రమీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కలుషిత ఆహారంతో నలుగురికి అస్వస్థత


వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులు

నగరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని కృష్ణా రామాపురంలో కలుషిత ఆహారం తీసుకున్న నలుగురు అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలోని వెంకటేశులు, రీటా దంపతులు, వారి ఇద్దరు పిల్లలు వాంతులు, విరేచనాలతో బాధపడుతుండగా నగరి ఏరియా వైద్యశాలకు స్థానికులు తరలించారు. కలుషిత ఆహారం వల్లే ఇలా జరిగిందని వైద్యులు గుర్తించారు. దీనిపై ఎంపీడీవో వాణిని వివరణ కోరగా.. పంచాయతీ కార్యదర్శిని గ్రామానికి పంపి.. బ్లీచింగ్ పౌడర్ చల్లించామని చెప్పారు.

'రీ సర్వే' సమర్థవంతంగా నిర్వహించండి: ఆర్డీవో


అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో అనుపమ

నిండ్ర, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నిండ్ర మండలంలో 3వ విడత భూ రీ సర్వే పనులను సమర్థవంతంగా నిర్వహించాలని నగరి ఆర్డీవో అనుపమ ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. అలాగే పీజీఆర్ఎస్ అర్జీలను పరిశీలించారు. అనంతరం కేఆర్ పాళెంలో జరుగుతున్న రీ సర్వేని, ఈ-క్రాప్ పంట నమోదును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, సర్వేయర్ వెంకటేష్, ఏవో తులసి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రైతులకు విరివిగా రుణాలు

పాలసముద్రం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సింగిల్ విండోల ద్వారా మండలంలో పంటలు సాగుకు అవసరమైన రుణాలను రైతులకు విరివిగా ఇస్తామని గంగాధరనెల్లూరు డీసీసీబీ మేనేజర్ గోమతి తెలిపారు. గురువారం పాలసముద్రం సింగిల్ విండో కార్యాలయ ఆవరణంలో రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. సూపర్‌వైజర్ చంద్రశేఖర్, సీఈవో వెంకటముని, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు

యాదమరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): యాదమరి పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ సాయినాథ్ గురువారం తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలను ఎస్ఐ ఈశ్వర్‌ని అడిగి తెలుసుకున్నారు. వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం వాయిదా

గుడిపాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సింగిల్‌విండో, టీడీపీ మండల అధ్యక్ష పదవులకు ప్రమాణ స్వీకారోత్సవం ఈనెల 12వ తేదీన నిర్వహించాలి. అనివార్య కారణాలతో ఈనెల 15వ తేదీకి వాయిదా పడిందని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గుడిపాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎదురుగా 15న కార్యక్రమం ఉంటుందన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ



చిత్తూరు అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మెప్మా, సపోర్ట్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో గురువారం ప్రపంచ నిరాశ్రయుల దినాన్ని నిర్వహించారు. నిరాశ్రయులకు దుప్పట్లను నెహ్రూ యువ కేంద్ర కో-ఆర్డినేటర్ ప్రదీప్ పంపిణీ చేశారు. సపోర్ట్ సంస్థ నిర్వాహకుడు జోసఫ్‌రాజు, నెహ్రూ యువ కేంద్ర గణాంక అధికారి బాబురెడ్డి పాల్గొన్నారు.

దృష్టిలోప నివారణ దినం

చిత్తూరు రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం దృష్టిలోప దినం నిర్వహించారు. కంటి వైద్యనిపుణులు అర్పిత, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు జీతాలు పెంచాలి: ఏఐటీయూసీ

నగరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలకు జీతాలు పెంచి, పనిభారం తగ్గించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కోదండయ్య, ఆశా వర్కర్స్ అధ్యక్షులు చెందామర్రై డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయం వద్ద జరిగిన ఆశా వర్కర్ల సమావేశంలో వారు ప్రసంగించారు. విజయలక్ష్మి, రాజేశ్వరి, చెంచులక్ష్మి, ఇందిరా, పుష్ప, జయప్రద తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీలు

పాలసముద్రం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో సతీష్ ఆదేశించారు. గురువారం శ్రీకావేరిరాజుపురం సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది గ్రామాలకు వెళ్లాల్సి వస్తే మూమెంట్ రిజిస్టర్‌లో తప్పకుండా నమోదు చేయాలని సూచించారు.

జీఎస్టీపై అవగాహన

నగరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరి ఏరియా వైద్యశాలలో సిబ్బందికి, రోగులకు జీఎస్టీపై అవగాహన కల్పిస్తూ నోడల్ అధికారి పూర్ణ సదస్సు నిర్వహించారు. సూపరింటెండెంట్ ప్రభావతి, సీఎస్ఆర్ఎంవో మంజుల, డాక్టర్లు కార్తికేయ, ప్రశాంతి, శ్రీనాథ్, లోకేష్, గీతకుమారి పాల్గొన్నారు.

ఐరాల: జీఎస్టీ తగ్గింపు పేదలకు వరమని ఐరాల ప్రభుత్వాస్పత్రి డాక్టర్ రెడ్డెప్ప అన్నారు. గురువారం ఆస్పత్రిలో జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్లు శ్రీవాణి, వెంకటేశ్వరరావు, సీహెచ్‌వో ఆదిలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, మేల్ హెల్త్ అసిస్టెంట్ మునిరత్నం పాల్గొన్నారు.